
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
బుధవారం 2 ఏప్రిల్ 2025



దయనీయం

పండించిన ధాన్యం అమ్ముకోలేక రైతుల అవస్థలు

జిల్లాలో రబీ సీజన్‌లో 3,041 హెక్టార్లలో వరి సాగు

- 45 వేల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- 10వేల టన్నుల కొనుగోలుకే ప్రభుత్వం అనుమతి
- రైతుల వద్దే ఇంకా ఖరీఫ్ ధాన్యం 1.50 లక్షల టన్నుల నిల్వలు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: జిల్లాలో రబీ సీజన్‌లో వరి సాగుకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వలేదు. కాలువలకు సాగు నీటిని విడుదల చేయలేదు. అయినప్పటికీ ఏటా మాదిరిగానే గన్నవరం, కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, బాపులపాడు తదితర మండలాల్లో 3,041 హెక్టార్లలో బోరునీటి ఆధారంగా రబీ సీజన్‌లో వరిసాగు చేశారు. ఎంటీయూ 1121, 1153, 1156, రకాల వరి వంగడాలతో పాటు పంజాబ్ రకంగా పిలుస్తున్న పీఆర్-126 రకం వరి వంగడాన్ని రైతులు సాగు చేశారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో వాతావరణం వరి సాగుకు అనుకూలంగా ఉండటంతో, ఎకరానికి సరాసరిన 48 బస్తాల దిగుబడి వస్తోందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.


రైతు ఇంట ధాన్యం నిల్వలు

అరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి అన్నదాతలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. రబీ సీజన్‌లో 3,041 హెక్టార్లలో వరి సాగు చేసిన రైతులకు 45 వేల టన్నుల వరకు ధాన్యం వచ్చే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం మాత్రం 10 వేల టన్నులు కొనుగోలుకు అనుమతి ఇచ్చింది. మిగిలిన ధాన్యం ప్రైవేటు మార్కెట్లో అమ్ముకుందామంటే మిల్లర్లు, వ్యాపారులు తక్కువ ధరలకు అడుగుతున్నారు. సరేనని తక్కువ ధరకు విక్రయించేందుకు ముందుకు వస్తే సొమ్ము చెల్లింపులు ఆలస్యమవుతాయంటూ రైతుల సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇప్పటికే ఖరీఫ్ సీజన్‌లో వచ్చిన ధాన్యం 1.50 లక్షల టన్నులు రైతుల ఇళ్ల వద్దే దర్శనమిస్తున్నాయి.


ధాన్యం బస్తా ధర రూ.1,625 మాత్రమే..

ఖరీఫ్ సీజన్‌లో 75 కిలోల ధాన్యం బస్తాకు ప్రభుత్వం ఏ-గ్రేడ్ రకం ధాన్యం రూ.1,740, సాధారణ రకం ధాన్యం రూ.1,725 మద్దతు ధరగా నిర్ణయించింది. ధాన్యం కొనుగోలును మార్చి 31వ తేదీతో నిలిపివేయడంతో మిల్లర్లు ధాన్యం ధరలను తమ అదుపులోకి తెచ్చుకున్నారు. జిల్లాలోని మిల్లు యజమానులు, వ్యాపారులు ప్రభుత్వంతో సంబంధం లేకుండా తాము ధాన్యం కొనుగోలు చేస్తామని, కానీ బస్తాకు రూ.1,625 మించి ధర ఇవ్వలేమని చెబుతున్నారు. మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ ధరకే ధాన్యం కొనుగోలు చేశారు. రెండు, మూడు రోజుల్లో ఈ ధర మరింతగా తగ్గవచ్చని సూచనప్రాయంగా మిల్లర్లు, వ్యాపారులు రైతులకు సంకేతాలు పంపుతున్నారు. మండపేట, తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులకు, మిల్లర్లకు ధాన్యం విక్రయిస్తే బస్తా ధాన్యం రూ.1,550 మించి ధర ఇవ్వడం లేదు, ధాన్యం రవాణా చార్జీలను రైతులే భరించాలని చెప్పి ధాన్యం మద్దతు ధరలో కోతపెడుతున్నారు. ఈ నగదు కూడా ఇప్పుడే ఇవ్వలేమని స్థానికేతరులైన వ్యాపారులు, మిల్లర్లు చెప్పడం గమనార్హం. వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేసిన తర్వాత ముఖం చాటేస్తే తమ పరిస్థితి ఏమిటనే అంశంపైనా రైతుల్లో ఆందోళన నెలకొంది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం ఇంకా రైతుల వద్ద 1.50 లక్షల టన్నుల వరకు ఉండగా, రబీ సీజన్‌కు సంబంధించిన ధాన్యం 45వేల టన్నుల వరకు వస్తుంది. మొత్తం ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

10 వేల టన్నుల కొనుగోలుకు అనుమతి

జిల్లాలోని కంకిపాడు, పెనమలూరు తదితర మండలాల్లో మూడు వేల హెక్టార్లకుపైగా వరి సాగు జరగ్గా, ఈ రబీ సీజన్‌లో 45 వేల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారుల అంచనాగా ఉంది. ఇప్పటికే రబీ సీజన్‌లో సాగు చేసిన వరి కోతకు సిద్ధంగా ఉంది. కొన్ని ప్రాంతాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో తాజాగా జిల్లా నుంచి రబీ సీజన్‌కు సంబంధించి 10 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. 45 వేల టన్నుల దిగుబడి అంచనాగా ఉండగా, కేవలం 10 వేల టన్నుల ధాన్యం కొనుగోలుకు అనుమతులు ఇవ్వడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నెలలో మళ్లీ ధాన్యం కొనుగోలు కోసం ప్రభుత్వం అనుమతులు ఇస్తుందా, లేదా అనే అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థులతో పాఠాలు అప్పజెప్పించుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర



పాఠాలు చెప్పి.. ప్రశ్నలు అడిగి!

ఉపాధ్యాయుడైన మంత్రి కొల్లు రవీంద్ర

ఈడేపల్లి మునిసిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో మమేకం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రజా సేవలో క్షణం తీరిక లేకుండా గడిపే రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మంగళవారం ఉపాధ్యాయుడిగా మారిపోయారు. ఈడేపల్లి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో ఒక గంట సేపు పాఠ్య పుస్తకాలు చేత పట్టుకుని విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులతో రైమ్స్ చెప్పించారు. మన రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, కలెక్టరు ఎవరూ అంటూ ప్రశ్నించి విద్యార్థులను నుంచి సమాధానాలు రాబట్టారు. మూడవ తరగతిలో విద్యార్థుల మధ్య బెంచీలపై కూర్చుని ఎక్కాలు అప్పజెప్పించుకున్నారు. వివిధ పాఠ్యాంశాల్లోని ప్రశ్నలు అడుగుతూ సరదగా గడిపారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుంది.. టీచర్లు సరిగా పాఠాలు చెబుతున్నారా లేక కొడుతున్నారా అని ప్రశ్నించారు. చిన్నారులు చెప్పిన సమాధానాలు విని మంత్రి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇకపై ప్రతి శనివారం మీరు బ్యాగ్‌లు మోసుకుని రానక్కరలేదని, ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపే రోజులు వచ్చాయన్నారు.

కృష్ణాతీరంలో అడుగుల సవ్వడి

వేసవిలో హీట్‌ను బీట్ చేస్తామంటున్న కృష్ణా రివర్ వాకర్స్

- కృష్ణాతీరంలో ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత 8లో
- కనకదుర్గవారధి కింద శాండ్ వాక్, యోగా, స్విమ్మింగ్



కదిలించిన ఫిర్యాదులు

బుడమేరులో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు


బుడమేరులో మట్టి తవ్వకాలను పరిశీలిస్తున్న డ్రైనేజీ శాఖ అధికారులు

- ఫిర్యాదులు చేసిన గ్రామస్తులు, కూటమి నాయకులు
- ఎట్టకేలకు క్షేత్రస్థాయి పరిశీలనకు డ్రైనేజీ అధికారులు

గుడివాడ, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఇటీవల బుడమేరులో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా సాగాయి. అనుమతి లేకుండా మట్టి తరలింపుపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వెలువడ్డాయి. గ్రామస్తులు, కూటమి నాయకుల ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం డ్రైనేజీ అధికారులు పరిశీలనకు వెళ్లారు. అధికారులు వస్తున్నారనే విషమం తెలుసుకుని హుటాహుటీన బుడమేరు కట్టపై మట్టిపోసి డ్రైనేజీ అధికారులు కళ్లు గప్పారు. వివరాల్లోకి వెళితే... పెదపారుపూడి మండలం మోపర్రు పంచాయతీ పరిధిలో బుడమేరులో కాలువ వెడల్పు, ఎత్తును పెంచే విధంగా డ్రైనేజీశాఖ ఆధ్వర్యంలో పనులు చేపట్టారు. కాంట్రాక్టు ఎక్స్‌టెన్షన్ లేకుండానే కాంట్రాక్టర్ విచ్చలవిడిగా మట్టిని తవ్వి ఉంగుటూరు, గన్నవరం, ఉయ్యూరు ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్న విషయం తెలిసిందే. బుడమేరు వరదల్లో చేరిన మట్టి దిబ్బలను తవ్వేసుకుని రాత్రిళ్లు టిప్పర్లతో తరలించుకుపోయారు. దీనిపై డ్రైనేజీ అధికారులు ఆలస్యంగా స్పందించారు. అందునా గ్రామస్తులు, టీడీపీ నాయకుల ఫిర్యాదుతో కదిలారు. మంగళవారం రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ మజ్జాడ నాగరాజు ఫిర్యాదుతో అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లారు. బుడమేరు కట్ట పటిష్టతకు పనులు చేపట్టారు.

స్థానికులకు ఉపాధి కల్పించండి

బుడమేరులో తమ గ్రామ పరిధిలో పనులు జరుగుతుండటంతో తమకు ఉపాధి చూపాలంటూ గ్రామస్తులు డ్రైనేజీ అధికారులను కోరారు. కట్టను పటిష్ట పరచాలని, గతంలో వరదల వలన తాము తీవ్రంగా నష్టపోయామని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. గ్రామంలోని ట్రాక్టర్‌లను పనుల్లో వినియోగించుకోవాలని కోరారు. ప్రస్తుతం మోపర్రు వైపు పనులు జరుగుతున్నాయని, చేదుర్తిపాడు పరిధిలో పనులు ప్రారంభమవ్వగానే ఉపాధి అవకాశాలు కల్పించేలా చూస్తానని కాంట్రాక్టర్ హామి ఇచ్చారు.

రాత్రి పూట పనులకు అనుమతులివ్వవద్దని ఎస్ఈకి లేఖ


వరుస ఫిర్యాదుల నేపథ్యంలో బుడమేరులో రాత్రిళ్లు పనులు చేయకుండా ఉత్తర్వులివ్వాలని డ్రైనేజీ అధికారులు ఎస్ఈకి లేఖ రాశారు. తాము విధుల్లో ఉండే వరకు పనులు జరిగేలా చూడాలని, రాత్రి ఏడు గంటల తరువాత ఎటువంటి పనులు చేయవద్దని కోరారు. డ్రైనేజీశాఖ గుడివాడ ఈఈ కిరణ్‌బాబు, డీఈ గణపతి, ఏఈ అనిల్, పాములపాడు డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, కాంట్రాక్టర్ గొట్టిపాటి శ్రీధర్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బ్రాండ్.. ఎన్టీఆర్ గ్రాండ్ టూరిజం!

సందర్శకులను ఆకట్టుకునేలా ప్రత్యేక పర్యాటక ప్యాకేజీలు

- 'ఆపరేషన్ టూరిజం' పేరుతో పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు
- హోటల్స్, రవాణా రంగాలతోనూ ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం చర్చలు
- జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు కలెక్టర్ లక్ష్మీశ కృషి



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): 'బ్రాండ్ ఎన్టీఆర్.. గ్రాండ్ టూరిజం' పేరుతో జిల్లాకు వచ్చిన పర్యాటకులను నాలుగు రోజుల పాటు ఇక్కడే ఉండేలా చేసేందుకు ఒక అద్భుతమైన జిల్లాస్థాయి టూరిజం సర్క్యూట్ ప్యాకేజీకి ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం శ్రీకారం చుట్టింది. జిల్లా స్థూల ఆదాయంలో 60 శాతం పైగా ఆదాయం పర్యాటకం, సేవా రంగాల ద్వారా వస్తోంది. దీంతో కలెక్టర్ లక్ష్మీశ ఎన్టీఆర్ జిల్లాను అగ్రపథంలో నిలిపేందుకు పర్యాటకరంగంపై దృష్టి మిగతా 6లో..

ప్యాకేజీని తక్కువ ధరకు తెచ్చేందుకు రవాణ, ఆతిథ్య రంగాలతో ఒప్పందం

జిల్లా టూరిజం ప్యాకేజీని అతి తక్కువ ధరకు తీసుకు వచ్చేందుకు వీలుగా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశాల మేరకు పర్యాటక అధికారులు రవాణ, ఆతిథ్య రంగాలతో ఒప్పందం చేసుకునే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా రవాణా, ఆతిథ్య రంగాలతో అధికారులు సమావేశమవుతున్నారు. ఆతిథ్య రంగంలో స్టార్ హోటల్స్, ఫోర్ స్టార్ హోటల్స్, త్రీ స్టార్ హోటల్స్, బడ్జెట్ హోటల్స్, రెసిడెన్సీలు, లాడ్జీలు వంటి వాటితో సంప్రదింపులు జరుపుతున్నారు. ప్రతిష్ఠాత్మక జిల్లా పర్యాటక ప్యాకేజీని బుక్ చేసుకున్న వారికి డిస్కౌంట్ రేట్లతో చార్జీ వసూలు చేసేలా వారితో చర్చలు నడుస్తున్నాయి. చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయి. ఇదే సమయంలో రవాణా రంగంతో కూడా అధికారులు చర్చలు జరుపుతున్నారు. రవాణా రంగానికి సంబంధించి ట్యాక్సీలు, ప్రైవేటు మినీ బస్ ఆపరేటర్లతో కూడా సంప్రదింపులు జరుపుతున్నారు. జిల్లా టూర్ ప్యాకేజీ బుక్ చేసుకున్న అతి తక్కువ ధరతో చార్జీలు తీసుకునేలా వాటి అసోసియేషన్స్‌తో సంప్రదింపులు చేస్తున్నారు.

బ్రాండ్ ప్రమోషన్స్

జిల్లా టూరిజం ప్యాకేజీలకు అధికార యంత్రాంగం బ్రాండ్ ప్రమోషన్‌ను కల్పించనుంది. ఆర్టీసీ బస్సులపై ప్రకటనలు, సినిమా థియేటర్లలో స్లైడ్స్, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు ఇలా జనసమ్మర్థం ఉన్న ప్రాంతాలలో పర్యాటక ప్యాకేజీలకు సంబంధించి ప్రచారం కల్పించనుంది. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా కూడా ప్రచారం చేయించనుంది. జిల్లాకు చెందిన ప్రముఖులనే బ్రాండ్ అంబాసిడర్లుగా గుర్తించి వారి ద్వారా కూడా వివిధ రంగాలకు చెందిన వర్గాలలో ప్రచారం కల్పించనుంది.

రహదారుల అభివృద్ధికి గ్రీన్ సిగ్నల్

రూ.2 కోట్లతో బైపాస్, మచిలీపట్నం రోడ్డు అభివృద్ధి

పది రోజుల్లో టెండర్లు పిలిచే అవకాశం

మచిలీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని జాతీయ రహదారి- 216 వెంబడి బైపాస్‌రోడ్లు, మచిలీపట్నంలోని మూడు స్తంభాల సెంటరు నుంచి కోనేరు సెంటర్ వరకు రహదారికి మరమ్మతులు చేసేందుకు జాతీయ రహదారుల విభాగం మార్చి 29వ తేదీన అనుమతులను మంజూరు చేసింది. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి-65 మచిలీపట్నంలోని మూడు స్తంభాల సెంటరు వరకు నాలుగులేన్లుగా విస్తరణ జరిగింది. మూడు స్తంభాల సెంటరు నుంచి కోనేరు సెంటరు వరకు 1.200 కిలోమీటర్ల మేర రహదారి ఎంతో కాలంగా అభివృద్ధికి నోచుకోలేదు. దీంతో పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ రహదారిపై గుంతలు పడ్డాయి. ఈ రహదారిని అభివృద్ధి చేసేందుకు సుమారు కోటి రూపాయలతో అంచనాలు రూపొందించారు. జాతీయ రహదారి-216 కృత్తివెన్ను మండలం యండపల్లి వద్ద, బంటుమిల్లి మండలం పెందుర్రు వద్ద బైపాస్ రోడ్లకు గుంతలు పడ్డాయి. ఈ గుంతలను పూడ్చేందుకు గాను సుమారుగా కోటి రూపాయలను మంజూరు చేస్తూ జాతీయ రహదారుల విభాగం అనుమతులు ఇచ్చింది. ఈ పనులకు పది రోజుల్లో టెండర్‌లు పిలుస్తారని అధికారులు తెలిపారు.

పరీక్షలు అయిపోయాయ్!


కోడూరులో పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థినులు



జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఆఖరి సబ్జెట్ రాసిన విద్యార్థులు పరీక్ష కేంద్రాల నుంచి చిరునవ్వులు చిందిస్తూ బయటకు వచ్చారు. దేదీప్యమానంగా వెలిగిపోతున్న ముఖాలతో ఒకరికొకరు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఇక పరీక్షలు అయిపోయాయ్ అంటూ రోడ్లపై సందడి చేస్తూ ఇళ్లకు చేరారు.

'గోవిందరాజు' భూములపై విచారణ

సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పటమట గోవిందరాజు ధర్మ ఈనాం ట్రస్టు భూములపై విచారణకు రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ ఆదేశించారు. 'రూ.250 కోట్ల పబ్లిక్ ట్రస్ట్ భూమి గోవిందా!' అనే శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' మంగళవారం ప్రత్యేక కథనం ప్రచురించింది. దీనిపై దేవదాయశాఖ స్పందించింది. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ విచారణకు ఆదేశించారు. దీనిపై సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని కోరారు. 2023లో మచిలీపట్నం శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఈవో సుబ్బారెడ్డి గోవిందరాజులు ట్రస్ట్‌కు సంబంధించిన సమగ్ర విచారణ జరిపి ఒక నివేదిక ఇచ్చారు. దేవదాయశాఖ కమిషనర్ దీనిపై సుబ్బారెడ్డి నుంచి కూడా వివరాలు అడిగి తెలుసుకున్నారని తెలుస్తోంది. అప్పట్లో సుబ్బారెడ్డి గుర్తించిన అంశాలన్నింటిని కమిషనర్‌కు విన్నవించారని సమాచారం. ముమ్మాటికీ పబ్లిక్ ట్రస్ట్ భూములని, ప్రైవేటు ట్రస్టు మాదిరిగా వాటిని విక్రయించటం చట్టవిరుద్ధమని ఆయన చెప్పినట్టు తెలిసింది. దేవదాయ శాఖ కమిషనర్ సమగ్ర విచారణకు ఆదేశించటంతో.. మరోమారు విచారణ కమిటీని నియమించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

దేవరపల్లిలో బుసక దందా!
- బీసీ సొసైటీ భూముల్లో నెల రోజులుగా రాత్రివేళ తవ్వకాలు 6లో

పింఛన్లకు రూ.33 వేల కోట్లు
- మంత్రి కొల్లు రవీంద్ర 6లో

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని
- పంచ ప్రాధాన్యాల పేరిట గ్రామాల్లో పనులు 8లో
- పీఆర్, ఆర్డీ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్



లలితా త్రిపుర సుందరీదేవికి చామంతులతో పుష్పార్చన

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గమ్మకు నిత్యం లలితా సహస్రనామ పారాయణం, జప, తర్పణ నిర్వహిస్తారు. ఆదిశంకరాచార్యులు అమ్మవారిని దర్శించుకున్న తరువాత, ప్రతిష్ఠించిన శ్రీచక్రానికి నిత్యం పూజలు జరుగుతుంటాయి. ఈ క్రమంలో అమ్మవారిని ఉగ్రరూపం నుంచి లలిత మనోహర సుందర దివ్యరూపాన్ని భక్తులకు ప్రదర్శించాలని ఆదిశంకరాచార్యులవారు కోరటంతో మహిషాసుర మర్దినిగా స్వయంభువుగా అవతరించిన దుర్గమ్మ అనుగ్రహించి సౌందర్యలహరిలో పేర్కొన్నట్టుగా లలిత లావణ్య సుమధుర సోయగాల చిరుమందహాస మూర్తిగా భక్తులను దీవిస్తూ దర్శనమిచ్చింది. అప్పటి నుంచి ఆమెను లలితా సహస్రనామంతో అర్చిస్తారు. లలితా సహస్ర నామంలో ఒక చోట ఆమెకు చాంపేయ కుసుమ ప్రియ అని వస్తుంది. అందుకే ఆమెను చామంతులతో కొలవటం వల్ల సంతుష్టిరాలువుతుందని నమ్మిక. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో చైత్ర మాస వసంత నవరాత్రుల్లో తొమ్మిది రోజులపాటు అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో పూజించటం జరుగుతుంది. మంగళవారం పసుపు, తెలుపు చామంతులు, మల్లెలతో ప్రత్యేక పుష్పార్చన వైభవంగా జరిగింది. పూజా మండపం (నటరాజస్వామి ఆలయ ప్రాంగణం)లో ఉదయం 9 గంటలకు పుష్పార్చన ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. జపాన్ దేశం టోక్యో నగరానికి చెందిన మహిళలు దుర్గమ్మ పుష్పార్చనలో పాల్గొన్నారు. విజయవాడ సందర్శనలో భాగంగా దుర్గమ్మ మహిమలు గురించి స్థానికుల నుంచి తెలుసుకుని పుష్పార్చనలో పాల్గొన్నట్టు వారు పేర్కొన్నారు.



పూజల్లో జపాన్ యువతులు



ఆర్టీసీ చైర్మన్ కొనకళ్లకు వినతి పత్రం ఇస్తున్న ఎన్ఎంయూ నేతలు

పెండింగ్ సమస్యలు పరిష్కరించండి

» ఆర్టీసీ చైర్మన్‌కు ఎన్ఎంయూ నేతల వినతి

బస్‌స్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణను నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఇతర నాయకులు కోరారు. మంగళవారం బస్‌స్టేషన్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ భవన్‌లో కొనకళ్లను యూనియన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. ఇప్పటికే సమస్యలపై ఎండీకి వినతి పత్రం ఇచ్చామని గుర్తుచేశారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను సత్వరం పరిష్కరించాలని చైర్మన్‌ను కోరారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని చైర్మన్‌కు అందజేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, సంయుక్త కార్యదర్శి ఎస్.రాజేష్ కుమార్, విజయవాడ జోనల్ కార్యదర్శి ఎ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఆర్టీసీ డిపోల వద్ద ఎర్ర బ్యాడ్జీలతో నిరసన

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోల వద్ద బుధ, గురువారాల్లో ఎర్ర బ్యాడ్జీలతో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు ఎన్ఎంయూ నేతలు ఒక ప్రకటనలో తెలిపారు. 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, సస్పెన్షన్లు, అక్రమ తొలగింపులను ఆపాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన ప్రమోషన్లను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాన్ ఆపరేషన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు.



ముప్పాళ్లలో ముఖ్యమంత్రి పర్యటన స్థలం పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య

5న ముప్పాళ్లకు సీఎం చంద్రబాబు

» ఏర్పాట్ల పరిశీలనలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యే సౌమ్య

చందర్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మండలంలోని ముప్పాళ్ల రానున్నారు. ఈనెల 5న జగ్జీవన్‌రామ్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తున్నది. ఈక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ముప్పాళ్లలో పర్యటించనున్నారు. తొలుత జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తారు. ఆయన దేశానికి చేసిన సేవలను వివరించనున్నారు. అక్కడే ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించే అవకాశం ఉంది. అనంతరం పీ-4 కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఎస్సీ కాలనీల్లో ప్రజల ఆర్థిక స్థితిగతులను ముఖ్యమంత్రి స్వయంగా తెలుసుకోనున్నారు. పూర్తిగా పేదరికంతో ఉన్న వారిని గుర్తించి వారిని గ్రామంలోని సంపన్నులకు దత్తత ఇవ్వనున్నారు. అనంతరం నియోజకవర్గంలోని పార్టీ ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, ప్రభుత్వవిప్ తంగిరాల సౌమ్యలు ముప్పాళ్ల గ్రామంలో పర్యటించారు. సమావేశానికి అనువైన స్థలం కోసం అన్వేషించారు. హెలిప్యాడ్ ప్రదేశాలను పరిశీలించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి చంద్రబాబు రానుండటం పట్ల కూటమి నేతల్లో ఉత్సాహం నెలకొన్నది. కార్యక్రమంలో ఆర్డీవో కె.బాలకృష్ణ, ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ కోట వీరబాబు, కోగంటి బాబు, మేకల సుధాకర్, ఉన్నం నరసింహారావు, నల్లాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లకు రూ.33వేల కోట్లు

» పింఛన్ల పంపిణీలో మంత్రి కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదలను ఆదుకునేందుకు రూ. 33వేల కోట్లను పింఛన్ల రూపంలో పంపిణీ చేస్తున్నట్టు మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నగరంలోని 47వ డివిజన్ ఈడేపల్లిలో మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావులు స్వయంగా లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఎన్టీఆర్ భరోసా



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కిడ్నీ బాధితుడైన వీరభద్రరావు 4 నెలలు కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేసుకుంటున్నారని, ఇటీవల కొత్త పింఛను మంజూరైనా ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి వలన పింఛను పంపిణీకి అవకాశం లేకపోయిందని, నెలకు రూ. 10వేల చొప్పున 3 నెలల పింఛను రూ. 30 వేలు ఒకేసారి ఇవ్వడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 63,27,116 పింఛనుదారులకు ప్రతి నెలా 2,722 కోట్ల రూపాయల చొప్పున పింఛన్లు పంపిణీ చేస్తున్నామన్నారు. జిల్లాలో 2,34,099 పింఛన్లు ఉండగా ఇప్పటికే 75 శాతం పంపిణీ చేశామన్నారు. కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పింఛన్లను పంపిణీ చేస్తుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందడుగు వేస్తుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మోటమర్రి బాబా ప్రసాద్, గొర్రెపాటి గోపీచంద్, పల్లపాటి సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నడకుదిటి ఆశయాలను సాకారం చేస్తా

» వర్ధంతి కార్యక్రమంలో మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్ : 'నడకుదిటి నరసింహారావు' బ్రాండ్ ఇమేజ్‌ను ఎన్ని తరాలైనా మచిలీపట్నం ప్రజలు మరచిపోలేరని, ఆయన ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తానని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మాజీ మంత్రి నడకుదిటి నరసింహారావు నాలుగో వర్ధంతి సందర్భంగా మంగళవారం మచిలీపట్నంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణతో కలిసి నరసింహారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కరోనా బారిన పడినప్పటికీ తిరిగి ఆరోగ్యంగా వస్తారనుకున్నామన్నారు. రాజకీయాల్లో నడకుదిటి అజాతశత్రువు అన్నారు. ఆయన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఎండి ఇలియాస్ పాషా, పిప్పళ్ల వెంకన్న, కుంచే నాని, తలారి సోమశేఖర్, జనసేన నేతలు తదితరులు పాల్గొన్నారు.

గృహ యోగం

» 2025-26 ఆర్థిక సంవత్సరానికి అర్బన్, రూరల్ కేటగిరీలలో ఎన్టీఆర్ జిల్లాకు 1,15,379 గృహాలు మంజూరు

» నిర్మాణాల కోసం 1,08,836 రిజిస్ట్రేషన్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు గృహయోగం కలగబోతోంది. ప్రధానమంత్రి ఆవాజ్ యోజన్ (పీఎంఏవై) పథకం కింద 1,15,379 గృహాల నిర్మాణానికి లక్ష్యం నిర్దేశించటం జరిగింది. ఇప్పటి వరకు 1,08,836 మంది దరఖాస్తు చేసుకోగా.. 26,610 గృహాలకు ఇంకా అవకాశం ఉంది. దీనికోసం జిల్లా ప్రజలు మండల హౌసింగ్ ఏఈ కార్యాలయంలో గానీ, గ్రామ సచివాలయంలోగానీ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఎన్టీఆర్ జిల్లాలో అర్బన్, గ్రామీణ ప్రాంతాలకు వేర్వేరుగా మొత్తం మూడు కేటగిరీల్లో ఇళ్లను మంజూరు చేయటం జరిగింది.

- అర్బన్ లోకల్ బాడీ (యూఎల్‌బీ) పరిధిలో పీఎంఏవై అర్బన్ (బీఎల్‌సీ) కేంద్రం వాటా రూ.1,50,000, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.30,000 కలిపి రూ.1,80,000 ఉంటుంది.
- అర్బన్ డెవలప్‌మెంట్ ఏరియా (యూడీఏ) పరిధిలో పీఎంఏవై (బీఎల్‌సీ)లో కేంద్ర వాటా రూ.1,50,000, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18,000, ఎస్‌బీఎం ద్వారా రూ. 12,000 కలిపి రూ. 1,80,000 ఉంటుంది.
- పీఎంఏవై గ్రామీణ పరిధిలో కేంద్రం రూ.1,20,000, రాష్ట్ర ప్రభుత్వం రూ.30,000, ఉపాధి హామీ పథకం ద్వారా రూ.18,000, ఎస్‌బీఎం ద్వారా రూ.18,000 కలిపి మొత్తం రూ.1,80,000 ఉంటుంది.



- ఎన్టీఆర్ జిల్లా తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 2,466, నందిగామ రెవెన్యూ డివిజన్ పరిధిలో 21,157, విజయవాడ అర్బన్ పరిధిలో 85.214 ఇళ్లు మంజూరయ్యాయి. నియోజకవర్గాల వారీగా తిరువూరు(2465), నందిగామ (12,690), జగ్గయ్యపేట (8,467), మైలవరం (23,750), విజయవాడ సెంట్రల్ (23,490), విజయవాడ తూర్పు (19,620), విజయవాడ పశ్చిమ (18,354) ఇళ్లు మంజూరయ్యాయి.

ముందుకు కదలని 2021-22 గ్రామీణ ఇళ్లు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021-22 ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ జిల్లా పరిధిలో 4,143 పీఎంఏవై గ్రామీణ ఇళ్లు మంజూరు కాగా వీటిలో 2,254 ఇళ్ల పనులు ప్రారంభమే కాలేదు. కేవలం పూర్తయిన ఇళ్లు 1007 మాత్రమే ఉన్నాయి.

బ్రాండ్ ఎన్టీఆర్..

(5వ పేజీ తరువాయి)

సారించారు. ఆపరేషన్ టూరిజం పేరుతో విభిన్న కోణాలలో అభివృద్ధి చేసే అంశాలను అన్వేషిస్తున్నారు. ఎన్టీఆర్‌జిల్లా భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ఒక టూరిజం సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాకు వచ్చిన వారు నాలుగురోజుల పాటు ఇక్కడ ఉండటానికి వీలుగా ఒక పర్యాటక మార్గాన్ని ప్యాకేజీగా తీసుకురావాలన్న ఆలోచన చేశారు. దీనికి అనుగుణంగా టెంపుల్ టూరిజం, అడ్వంచర్ టూరిజం, ఆతిథ్య రంగం, రవాణా రంగం వంటి అనేక సేవా రంగాలను కూడా సమ్మిళితం చేసి ఎన్టీఆర్ జిల్లా బడ్జెట్ టూరిజం ప్యాకేజీకి కలెక్టర్ లక్ష్మీశ శ్రీకారం చుట్టారు. ఆ మేరకు జిల్లా పర్యాటక అధికారులతో ప్యాకేజీ రూపకల్పన చేయిస్తున్నారు.

అనేక వనరులకు నిలయం

ఎన్టీఆర్ జిల్లాలో కృష్ణానదిని ఉత్తరవాహినిగా పిలుచుకునే జగ్గయ్యపేట ముక్త్యాల నుంచి పరిటాల వరకు కృష్ణాతీరం వెంబడి అనేక పుణ్యక్షేత్రాలు ఉన్నాయి. వీటన్నింటినీ గొలుసుకట్టుగా అనుసంధానిస్తారు. మధ్యలో కొండపల్లి బొమ్మల తయారీ పరిశ్రమలు, కొండపల్లి బొమ్మల విక్రయశాలలు వంటివి ప్యాకేజీకి జోడిస్తారు. జిల్లాను ప్రపంచ పటంలో నిలబెడుతున్న హస్తకళాఖండం కొండపల్లి బొమ్మలు కావటంతో బొమ్మల తయారీని ప్రత్యక్షంగా చూసేలా ప్యాకేజీలో పొందుపరచబోతున్నారు. ఆ తర్వాత ఎంతో చారిత్రక ప్రసిద్ధి చెందిన కొండపల్లి కోటను ప్రత్యక్షంగా చూసేలా, దాని చరిత్ర తెలుసుకునేలా టూరిజం ప్యాకేజీకి లేజర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు వంటివి వీక్షించేలా చేయటంతో పాటు ఆ తర్వాత కొండపల్లి రిజర్వు ఫారెస్ట్ అందాలను వీక్షించేలా, ట్రెక్కింగ్ చేసేలా టూర్ ప్యాకేజీకి జోడిస్తారు. మూలపాడు బటర్‌ఫ్లై పార్క్‌ను కూడా ఈ ప్యాకేజీలో అనుసంధానం చేస్తారు. ఇవన్నీ పూర్తయిన తర్వాత పవిత్ర సంగమం, విజయవాడలో కనకదుర్గమ్మ గుడి, బాపు మ్యూజియం, గాంధీహిల్, మొగల్రాజపురం గుహలు, ప్రకాశం బ్యారేజీ వంటి సందర్శనీయ ప్రాంతాలను ప్యాకేజీలో యాడ్ చేస్తారు. ఆ తర్వాత నగరంలో అత్యంత ప్రత్యేకమైన హరిత బెర్మ్‌పార్క్, భవానీ ద్వీపం సందర్శన, అక్కడే బస వంటి వాటిని కూడా ప్యాకేజీలో అంతర్భాగం చేస్తారు. చివరగా చెంతనే ఉన్న అమరావతి రాజధాని సందర్శన, ఉండవల్లి గుహలు, వెంకటేశ్వరస్వామి టెంపుల్, మంగళగిరి పానకాలస్వామి దేవాలయాల సందర్శన వంటి వాటిని కలుపుతూ ప్యాకేజీని ముగిస్తారు. ఈ ప్యాకేజీ కూడా పర్యాటకులు కోరుకున్నట్టుగా అమలు చేయటానికి రెండు, మూడు సర్క్యూట్లను రూపొందిస్తారు.

పర్యాటకాభివృద్ధికి ప్రణాళికలు

జిల్లాలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసే అంశాలపైనా ఇదే సందర్భంలో దృష్టి పెట్టనున్నారు. కొండపల్లి రిజర్వు ఫారెస్టు మంచి ట్రెక్కింగ్, సైట్ సీయింగ్ ప్రాంతంగా ఉంది. దాదాపుగా వందకు పైగా జలపాతాలను ట్రెక్కర్లు గుర్తించారు. ఇంకా లోపలికి వెళితే రిజర్వు ఫారెస్టు ఉంది. ఫారెస్ట్‌లో ట్రెక్కింగ్ చేసే వారికి, క్యాంపింగ్ చేసే వారికి తగిన సదుపాయాలను కల్పించే అంశంపై దృష్టి సారించారు. ఫారెస్ట్‌లోకి ఎంతవరకు వీలైతే అంత వరకు సిమెంట్ రోడ్డును వేయగలిగితే కొండపల్లి రిజర్వు ఫారెస్టుకు సందర్శకుల తాకిడి పెరుగుతుందని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. అలాగే రోడ్డు వెంబడి సిమెంట్ బల్లలు, షెల్టర్స్, తాగునీరు వంటివి ఏర్పాటు చేస్తే చక్కగా అడవిలో ప్రకృతిని ఆస్వాదించవచ్చని అంచనా వేస్తున్నారు. కొండపల్లి ఖిల్లాకు పునర్వైభవం తీసుకురావటానికి వీలుగా అక్కడ లేజర్ షో పునరుద్ధరణ, ఫెస్టివల్స్ నిర్వహణ వంటివి చేపట్టనుంది. కొండపల్లిని పర్యాటకంగా తీర్చిదిద్దటానికి వీలుగా పీపీపీ విధానంలో పలు ప్రాజెక్టులను చేపట్టాలని భావిస్తోంది.

యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా నేడు గొల్ల నరసింహ యాదవ్ బాధ్యతల స్వీకరణ

విద్యాధరపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : యాదవులు, బీసీల సంక్షేమం అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేస్తానని గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. మంగళవారం ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం యాదవ కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. 1982 నుంచి పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, ఎన్టీఆర్ అభిమానిగా ఉంటున్నానని తెలిపారు. తన 43 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఏ పదవి ఇచ్చినా వన్నె తెచ్చేలా పనిచేసినట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాలు, తూ.చ తప్పకుండా పాటిస్తూ పార్టీ ఎదుగుదలకు కృషి చేసినట్టు తెలిపారు.



ముప్పాళ్లలో పరీక్షా కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ లక్ష్మీశ

ముగిసిన పది పరీక్షలు

» ఎన్టీఆర్ జిల్లాలో 27,577 మంది హాజరు

» పరీక్షా కేంద్రాన్ని తనిఖీచేసిన కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చందర్లపాడు మండలంలోని ముప్పాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. చివరిరోజు సోషల్ పరీక్ష 168 కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించగా.. జిల్లాలో 27,840 మందికిగాను 27,577 మంది (99.06 శాతం) హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 64 కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో యూవీ సుబ్బారావు తెలిపారు.



కృష్ణా జిల్లాలో 20,875 మంది హాజరు

మచిలీపట్నం టౌన్ : కృష్ణాజిల్లాలో టెన్త్ పరీక్షలు ముగిసాయి. మార్చి 17న ప్రారంభమైన పరీక్షలు మంగళవారంతో ముగిసాయి. ఎక్కడా ఏ విధమైన సంఘటనలు జరగలేదు. పరీక్షలకు 21,178 విద్యార్థులకు గాను మంగళవారం 20,875 మంది హాజరయ్యారు. 98.79 శాతం నమోదైంది. కాగా 154 మంది ప్రైవేట్ విద్యార్థులకు 106 మంది హాజరయ్యారు. 68.83 శాతం నమోదయింది. డీఈవో పి.వి.జె. రామారావు, జిల్లా పరిశీలనాధికారి, జిల్లా పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజు పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించారు. లేడీయాంప్తిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏప్రిల్ 3 నుంచి జవాబుపత్రాల మూల్యాంకనానికి రంగం సిద్ధం చేస్తున్నట్టు డీఈవో రామారావు తెలిపారు.

హార్టీకల్చర్ సమగ్ర అభివృద్ధి లక్ష్యం

» కేంద్ర సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడి

వన్‌టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం 2014-15 నుంచి మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) పథకాన్ని అమలు చేస్తోంది.. దేశవ్యాప్తంగా హార్టీకల్చర్ రంగాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పథకం అమలవుతోంది. హార్టికల్చర్ రైతులకు మద్దతుగా ఉండేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ (ఎంఐఎస్) ధర తేడా భర్తీ చెల్లింపు (ఎంఐఎస్-పిడిపిఎస్) వంటి పథకాలు ప్రోత్సాహకాలు అమలు చేస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ వెల్లడించారు. విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) హార్టికల్చర్ రైతులకు కేంద్ర ప్రభుత్వం గత ఐదేళ్లుగా అందిస్తున్న మద్దతు వివరాలు తెలపాలని లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్ (ఎంఐడిహెచ్) పథకాన్ని సమీక్షించేందుకు నీతి అయోగ్ సహా అనేక స్వతంత్ర సంస్థలు అధ్యయనాలు చేశాయని, ఇందువల్ల హార్టికల్చర్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ప్రధానంగా గుర్తించటం జరిగిందన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు పథకంలో పలు మార్పులు చేయటం జరిగిందన్నారు.

రొయ్యల చెరువులోపడి కార్మికుడి మృతి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : రొయ్యల చెరువు వద్ద కాపలా ఉంటూ చెరువులోపడి కార్మికుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పెదపట్నం గ్రామంలో యర్రంశెట్టి నానికి చెందిన రొయ్యల చెరువుపై వి.కానూరుకు చెందిన చిటికినేని శివనాగబాబు (39) ఐదేళ్లుగా కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి చెరువులో బ్లీచింగ్ పౌడర్ చల్లాడు. ఎలక్ట్రికల్ ఫ్యాన్లకు స్విచ్ వేస్తూ పక్కనే ఉన్న చెరువులో పడి మృతిచెందాడు. వెంకటేశ్వరరావు, సత్యవతిలకు ఏకైక కుమారుడు శివనాగబాబు. చెల్లెళ్లకు పెళ్లిళ్ల చేసి కుటుంబానికి ఆసరాగా ఉంటున్న కొడుకు మృతితో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. వెంకటశివనాగబాబు మృతదేహాన్ని మంగళవారం గుర్తించారు. భౌతికకాయాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా శివనాగబాబుకు తెలుగుదేశం సభ్యత్వం ఉంది. ఆ కుటుంబాన్ని పార్టీ ఆదుకోవాలని వి.కానూరు టీడీపీ నేతలు కోరుతున్నారు.



మృతుడు చిటికినేని శివనాగబాబు

దేవరపల్లిలో బుసక దందా!

» బీసీ సొసైటీ భూముల్లో నెల రోజులుగా రాత్రివేళ తవ్వకాలు

» పక్క పొలాలు కోతకు గురయ్యేలా ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్న వైనం

» రెవెన్యూ అధికారుల అండతో స్థానిక టీడీపీ నాయకుల నిర్వాకం!

» పంట చేలకు ప్రమాదమని సమీప భూముల రైతుల ఆవేదన

(తోట్లవల్లూరు, ఆంధ్రజ్యోతి)

తోట్లవల్లూరు మండలం దేవరపల్లి బీసీ సొసైటీ ప్రభుత్వ భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా నెలరోజులుగా రాత్రి సమయాల్లో బుసక తవ్వకాలు అడ్డూ అదుపు లేకుండా జరుగుతున్నాయి.

స్థానిక టీడీపీ నాయకులు రెండు గ్రూపులుగా ఏర్పడి ఒకరోజు ఒక గ్రూపు, రెండోరోజు మరో గ్రూపు చొప్పున బుసక దందా చేస్తున్నారని పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు. వీరికి రెవెన్యూ అధికారుల అండ ఉందని బాహాటంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నదీపాయలో రహదారి వేసినప్పుడే రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని, దాంతో బుసక అక్రమ తవ్వకాలకు తెరలేపారని రైతులు ఆరోపిస్తున్నారు. రాత్రి 7 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల వరకు యంత్రాలతో ట్రాక్టర్లకు బుసక లోడింగ్ చేస్తున్నారని, ప్రతిరోజు సుమారు వంద ట్రాక్టర్లలో రవాణా సాగిస్తున్నారని రైతులు తెలిపారు. ట్రాక్టర్‌లో బుసక లోడింగ్‌కి రూ 500 నుంచి రూ.700 వరకు వసూలు చేస్తున్నారని, ఇందుకు సహకరించే బీసీ సొసైటీ సభ్యుల్లో కొందరికి ట్రాక్టర్‌కి రూ.100 చొప్పున ముట్టజెప్పి.. ట్రాక్టర్ బుసకను గ్రామాల్లో రూ. 1500 వరకు విక్రయిస్తు అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారని చెప్పారు.



దేవరపల్లి బీసీ సొసైటీ భూముల్లో బుసక తవ్వకాలు



నిబంధనలకు విరుద్ధం

ప్రభుత్వం ఇచ్చిన సొసైటీ భూములను సాగుచేసుకుని జీవించాలని, ఈ విధంగా మట్టిని అమ్ముకోకూడదని నిబంధనలు చెపుతున్నాయి. సాగుకి అనుకూలంగా లేకుంటే అధికారులకు దరఖాస్తు చేసుకుని అనుమతి వచ్చాక తవ్వకాలు చేయాల్సి ఉంది. అయితే ఒక్క రైతు కూడా దరఖాస్తు చేయకుండా సదరు టీడీపీ నేతలు దగ్గరుండి బుసక తవ్వకాలు సాగించటం దారుణమని విమర్శలు వస్తున్నాయి.

పంటలకు ప్రమాదం

మొక్కజొన్న పండిస్తున్న భూములకు వరదవస్తే ప్రమాదం వాటిల్లేలా లోతుగా బుసక మట్టిని తవ్వేశారని, దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియకుండా ఉందని పలువురు రైతులు వాపోయారు. మూడు చోట్ల మూడెకరాల వరకు బుసక తవ్వకాలు జరిగాయని చెప్పారు. అధికారులు అడ్డుకట్ట వేయకపోతే సొసైటీ భూములకు రక్షణ ఉండదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తవ్వకాల విషయం తెలియదు! పరిశీలించి చర్యలు తీసుకుంటా..

\- తహసీల్దార్ ఎం.కుసుమకుమారి

దేవరపల్లి బీసీ సొసైటీ భూముల్లో బుసక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ ఎం.కుసుమకుమారిని వివరణ కోరగా.. ఆ విషయం తనకు తెలియదన్నారు.

ఇప్పటివరకు బుసక తవ్వకాలకు ఎవరూ దరఖాస్తు చేయలేదని, అక్రమ తవ్వకాలకు రెవెన్యూ సహకరిస్తుందన్న ఆరోపణలు నిజం కాదన్నారు. వీఆర్వోకి చెప్పి తవ్వకాలను నిలిపివేయిస్తానని ఆమె పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

టీడీపీ నాయకులు, కార్యకర్తల సంక్షేమమే మంత్రి లోకేశ్ లక్ష్యం

గన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ నాయకుల, కార్యకర్తల సంక్షేమమే యువనేత, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మండలంలోని చనుపల్లివారిగూడెంకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు కూచిపూడి సుబ్బయ్య ఇటీవల రామవరప్పాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పార్టీ నుంచి మంజూరైన ప్రమాద బీమా చెక్కును మంగళవారం ఆయన సతీమణి విజయలక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, నిబద్ధత గల నాయకుడిని కోల్పోయామని, కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందన్నారు. సుబ్బయ్య మాస్టారు సతీమణి విజయలక్ష్మి, కుమార్తె వన్నశీలను ఆప్యాయంగా పలకరించారు. టీడీపీ మండల కార్యదర్శి బోడపాటి రవి, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు మేడేపల్లి రమ, రామినీడు బసవపూర్ణయ్య, మేడేపల్లి సురేష్ పాల్గొన్నారు.

పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటితొట్టెలు

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్

ఉంగుటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ఉపాధిహామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని మానికొండలో మంగళవారం జరిగిన పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి భూమిపూజ, సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ ఎం.కృష్ణతేజ, ఉపాధిహామీ పథకం జిల్లా డైరెక్టర్ వీకే షణ్ముఖ్‌కుమార్, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి ఆయన పాల్గొన్నారు.


మానికొండలో పశువుల తాగునీటి తొట్టె నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్,

రాష్ట్ర వ్యాప్తంగా 15వేల తాగునీటి తొట్టెలు

వేసవిలో ఆరుబయట తిరిగే పశువులు నీటి ఎద్దడికి గురికాకుండా వుండేందుకు రాష్ట్రవ్యాప్తంగా 15వేల తాగునీటి తొట్టెలను నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిందని శశిభూషణ్‌కుమార్ అన్నారు. ఈ నెల 15నాటికి నిర్మాణాలు పూర్తిచేసే విధంగా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మానికొండలో మూడు పశువుల తాగునీటి తొట్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

గ్రామంలో కలుషిత నీరు సరఫరా

గ్రామంలో నూతనంగా నిర్మించిన సీసీరోడ్డును పరిశీలిస్తున్న క్రమంలో పంచాయతీ కుళాయిల ద్వారా పచ్చగా వున్న కలుషిత నీరు సరఫరా అవుతోందని స్థానికులు శశిభూషణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన ఇకపై కలుషిత నీరు సరఫరా జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నిమ్మకూరి స్వర్ణలత, వైస్ఎంపీపీ వీరంకి కుసుమకుమారి, ఎంపీటీసీ ఇందుపల్లి ముత్తయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం, డ్వామా పీడీ ఎన్‌వీ శివప్రసాద్ యాదవ్, పశుసంవర్ధకశాఖ డీడీ చిన నరసింహులు, డీపీవో జే.అరుణ, పంచాయతీరాజ్ ఏఈ జి.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ సుధాకర్, పశుసంవర్ధకశాఖ ఏడీ బాలకృష్ణ, తహసీల్దార్ జె.విమలకుమారి, ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సూర్యప్రకాష్‌నాథ్, టీడీపీ నాయకులు ఆరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వేమండ రోడ్డును అభివృద్ధి చేయాలి

అడుగడుగున గుంతలతో అధ్వానంగా మారిన రోడ్డును అభివృద్ధి చేయాలని, ఇరిగేషన్ కాలువ పూడిక తీయించాలని టీడీపీ ఆధ్వర్యంలో మండలంలోని వేమండ గ్రామరైతులు మంగళవారం మానికొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిసి వినతి పత్రం అందజేశారు. వేమండ నుంచి కలవపాముల వెళ్లే జిల్లాపరిషత్ బీటీ (3కి.మీ)రోడ్డు తీవ్రంగా దెబ్బతిని, రూపురేఖలు కోల్పోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల గురించి టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి నేతృత్వంలో రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తిచేశారు. దీంతోపాటు దోసపాడు ఛానల్ నుంచి ముక్కపాడు వన్నేరు కాలువ వరకు ఇరిగేషన్ కాలువలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో గుర్రపుడెక్క, ముళ్లపొదలు దట్టంగా విస్తరించిదని కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో వేమండ సర్పంచ్ హనుమోలు నిర్మల, ఉపసర్పంచ్ నరిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ సీనియర్ నాయకులు తోట నాగభూషణం, ఆకుల కృష్ణార్జునరావు, దుక్కిపాటి రామకృష్ణప్రసాద్, హనుమోలు జనార్ధనరావు, ఆరికట్ల రవికుమార్, బెజవాడ నాగేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

ముస్తాబాదలో నీటి తొట్టెల ఏర్పాటు

గన్నవరం : వేసవిలో పశువులు తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని ప్రభుత్వం నీటి తొట్టెలను ఏర్పాటు చేస్తుందని సర్పంచ్ వేము రాధాకృష్ణ అన్నారు. మండలంలోని ముస్తాబాద రైల్వేస్టేషన్ రోడ్డులో రూ.33వేలతో నిర్మించనున్న పశువుల నీటి తొట్టెకు మంగళవారం శంకుస్థాపన చేశారు. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ మేరీ వైడూర్యం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు గుంటూరు ప్రసాద్, వేము విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాదలో నీటి తొట్టెల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన సర్పంచ్ వేము రాధాకృష్ణ


వెల్దిపాడులో చెత్తసేకరణపై సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ బాలాజీ

తడి పొడి చెత్తపై అవగాహన కల్పించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

ఉంగుటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించడం ద్వారా గ్రామాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని వెల్దిపాడు గ్రామాన్ని ఉదయం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. గ్రామంలో సామాజిక పింఛన్లు పంపిణీకి సిద్ధమైన సచివాలయసిబ్బంది, అధికారులతో కలిసి పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి సామాజిక పింఛన్లు పంపిణీచేశారు. అనంతరం కలెక్టర్ చెత్త సంపద కేంద్రాన్ని సందర్శించి, వర్మీ కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా ఎందుకు వేయాలి అనేది గ్రామప్రజలకు వివరించి వారిని చైతన్య పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో కే.జోగేశ్వరరావు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ వల్లూరి సూర్యప్రకాష్‌నాథ్, కార్యదర్శి నక్కా ఆదిశేషు పాల్గొన్నారు.


బాడీబిల్డింగ్ క్రీడాకారులను అభినందిస్తున్న గొట్టిపాటి శివరామకృష్ణప్రసాద్

రాష్ట్ర బాడీ బిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

పెనమలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టీఏబీబీఏ సహకారంతో ఈ నెల 4న భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేసినట్లు కానూరు అశోక్ జిమ్ నిర్వాహకులు తాళ్లూరి అశోక్ తెలిపారు. మార్చి 30న జరిగిన ఈ ఎంపికల్లో క్రీడాకారులను ఉమ్మడి జిల్లాల బాడీ బిల్డింగ్ అసోసియేషన్ చైర్మన్ గొట్టిపాటి శివరామకృష్ణప్రసాద్ మంగళవారం అభినందించారు. 50కిలోల విభాగంలో రాజు, 55కిలోల విభాగంలో దినేష్‌రెడ్డి, 60కిలోల విభాగంలో దినేష్, 65, 75కిలోల విభాగాల్లో హరి, గోపీచంద్‌లు ఎంపికైనట్లు అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆల్‌ఇండియా కరాటే పోటీలలో గెలుపొందిన మాదిరెడ్డి చైతన్యను అభినందించారు. కార్యక్రమంలో ఏపీఎస్‌కేయూ అధికారి కిషోర్, గోల్డెన్ ఫిట్నెస్ రాజు తదితరులు పాల్గొన్నారు.


ఈడుపుగల్లులో నిర్వహించిన పల్లెనిద్రలో పాల్గొన్న మాజీ ఎంపీపీ దేవినేని, సీఐ మురళీకృష్ణ, ఎస్సైలు

ఈడుపుగల్లులో పల్లెనిద్ర

కంకిపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో పోలీసులు ఫ్రెండ్లీ పోలీసింగ్‌పై దృష్టి పెట్టడం హర్షణీయమని కంకిపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షులు దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో మంగళవారం రాత్రి నిర్వహించిన పల్లె నిద్రలో సీఐ మురళీకృష్ణతో పాటు ఆయన పాల్గొన్నారు. గ్రామంలో పోలీసులు విస్తృతంగా పర్యటించారు. ప్రధాన కూడలిలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ, ప్రజలు చిన్న చిన్న సమస్యలను గ్రామంలోనే పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పందిపాటి ఇందిర, ఎస్సైలు డి. సందీప్, తాతాచార్యులు, టీడీపీ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో పీ. తారేశ్వరరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు స్వామి వారికి అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు హైదారాబాద్ వాస్తవ్యులు గంగిరెడ్డి లక్ష్మణరావు, గీత గాయత్రి దంతులు అన్నప్రసాద వితరణ చేశారు.


వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్

మదర్ థెరిస్సా కాలనీలో వైద్యశిబిరం

గన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వైద్యం అందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని 50 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు విశేష కృషి చేస్తున్నట్లు టీడీపీ టౌన్ అధ్యక్షులు జాస్తి శ్రీధర్ అన్నారు. స్థానిక మదర్‌థెరిస్సా కాలనీలో మంగళవారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్‌లు సునయాన, శ్రీహర్ష వైద్య సేవలు అందించగా శేషమ్మ, రాణిరాజ్యం, మాధవిలత, చంద్రిక, దుర్గాభవాని, ఉమా, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యూరులో ప్రజాదర్బార్ నేడు

ఉయ్యూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు కమిషనర్ పి వెంకటేశ్వరరావు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకుని అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. నగర పంచాయతీ పరిధిలో ప్రజలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఉద్యోగాలకు 35 మంది ఎంపిక

ఉయ్యూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏజీ అండ్ ఎస్ జీఎస్ కళాశాల కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్‌మెంట్‌సెల్, స్పీకింగ్ ట్రీ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కళాశాల ప్రాంగణ ఎంపికలో 35 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం శివనాథ్ తెలిపారు. డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18 నుంచి 28 సంవత్సరాలలోపు 120మంది ఎంపికకు హాజరుకాగా అందులో 35 మందిని పరీక్షల ద్వారా స్పీకింగ్ ట్రీ డైరెక్టర్ వై సాయికృష్ణ ఎంపిక చేసినట్లు తెలిపారు.




రంగన్నగూడెంలో పనులు ప్రారంభిస్తున్న ఆళ్ల గోపాలకృష్ణ.. కేసరపల్లిలో సర్పంచ్ లక్ష్మీమౌనిక.. కంకిపాడులో ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి

ఉపాధి పనులతో గ్రామాభివృద్ధి

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో కూలీలకు పనులు కల్పించడంతో పాటు చిన్నపాటి సమస్యలను పరిష్కరించడం ద్వారా గ్రామాభివృద్ధికి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం దోహదపడుతుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. దంటగుంట్లలో మంగళవారం ఉపాధి హామీ పథకంలో చేపట్టిన 600 మీటర్ల లింకు రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్, సర్పంచ్ యజ్ఞవరపు వెంకట రంగారావు, రవి, ముత్తిరెడ్డి శ్రీనివాసరావు, పిల్లా రంగమణి పద్మావతి పంచాయితీ పాలకవర్గ సభ్యులు, టీడీపీ అధ్యక్షుడు గలావలి సత్యన్నారాయణ, ఎంపీడీఓ జోగేశ్వరరావు, ఏవో తిరుమల రావు, జెఈ జయరాజు, ఎపీఓ అశోక్, ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, తెలుగుమహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికళ్యాణి, చిరుమామిళ్ల సూర్యనారాయణప్రసాద్, టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్ తదితరులు పాల్గొన్నారు.


దంటగుంట్లలో ఉపాధిహామీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

రంగన్నగూడెంలో

రైతుకు సహాయకారిగా ఉపాధిహామీ పథకం ఉంటోందని ఎనెస్పీ ఎల్పీ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ అన్నారు. రంగన్నగూడెంలో ఊరచెరువుకు నీరందించే సప్లయ్ చానల్ పూడికతీత పనులను మంగళవారం ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని కోనేరు చెరువును జలపుష్కరిణి పథకం కింద అభివృద్ధి చేయాలని ఉపాధిహామీ పథకం అధికారులను సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ ధర్మవరపు వెంకటరమణ, పాలసొసైటీ అధ్యక్షుడు మొవ్వా శ్రీనివాసరావు, కనకవల్లి శేషగిరిరావు, కాట్రు పాపారావు, నెరుసు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేసరపల్లి పంచాయతీ పరిధిలో..

గన్నవరం : ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీమౌనిక అన్నారు. మండలంలోని కేసరపల్లి పంచాయతీ పరిధిలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా లక్ష్మీమౌనిక మాట్లాడుతూ, ప్రభుత్వం కూలీ పెంచిందని చెప్పారు. వంద రోజులు సక్రమంగా ఉపాధిపనులు చేసుకోవాలని సూచించారు. ఉపాధి హామీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కంకిపాడులో

కంకిపాడు : ఉపాధి నిధులను రైతులు సద్వినియోగపరుచుకోవాలని కంకిపాడు ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, తెలుగురైతు జిల్లా కార్యదర్శి గొగినేని వెంకటరమణలు అన్నారు. కంకిపాడులో ఉపాధిహామీ నిధులతో చేపట్టిన పలు పనులను మంగళ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి నిధులను ఉపాధి కూలీలకు సకాలంలో పంపిణీ చేస్తుందన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉపాధి నిధులతో సహకారంతో రాష్ట్రంలో అనేక ప్రధాన రహదారులు అభివృద్ధి చేయించారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కొండ నాగేశ్వరరావు, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అర్హులందరికి పింఛన్లు : ఎమ్మెల్యే బోడె

కంకిపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : అర్హులందరికి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండలంలోని పునాదిపాడులో మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పింఛన్ల కోసం అర్హులు ఎదురు చూస్తున్నారన్నారు. అర్హులకు తప్పకుండా పింఛన్లతో పాటు ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, మునిబోయిన విజయకుమారి, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, అన్నే ధనయ్య, పులి శ్రీనివాసరావు, అనుమోలు శ్రీను, కాసరనేని కరుణ, మోహన్‌కృష్ణ, కిషోర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉయ్యూరు : ఎన్నికల హామీ మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్ రూ. 4 వేలకు పెంచి ప్రతి నెల మొదటి తేదీన లబ్ధిదారుల ఇంటివద్దనే అందచేస్తూ కూటమి ప్రభుత్వం మాటనిలబెట్టుకుందని చినఓగిరాల సర్పంచ్ యెనిగళ్ల శిరీష, మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు అన్నారు. చినఓగిరాలలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని మండల పార్టీ అధ్యక్షుడు కుటుంబరావు, ఎంపీడీవో శేషగిరిరావుతో కలసి ప్రారంభించారు.


పునాదిపాడులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ఉంగుటూరు : ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మానికొండలో సచివాలయసిబ్బంది, టీడీపీ నాయకులతో కలిసి పింఛన్లు పంపిణీచేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా వృద్ధులకు, దివ్యాంగులకు సామాజిక భద్రత, ఆర్థిక భరోసా కలుగుతోందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. దంటగుంట్లలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేశారు.

మహిళా సాధికారత, అభివృద్ధిలో మహిళలే కీలకం

పెనమలూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారత, అభివృద్ధిలో మహిళలదే కీలకపాత్ర అని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ పరిశోధన డీన్ ప్రొఫెసర్ సీహెచ్ లక్ష్మీకుమారి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ప్రాంగణంలో జరిగిన మహిళల శక్తి, సమష్టి చర్య అనే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఐక్యరాజ్యసమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో లింగ సమానత్వం, శాంతి న్యాయం సాధించడంలో మహిళలు పోషించే పాత్రపై తన అభిప్రాయాన్ని ప్రొఫెసర్ కుమారి పంచుకొన్నారు. సమాన అవకాశాల విభాగం చైర్‌పర్సన్ డాక్టర్ సీహెచ్ బేబీరాణి, యూనిట్ కార్యదర్శి డాక్టర్ కొల్లా నరేంద్రలు అతిథిని సన్మానించారు.


ప్రొఫెసర్ లక్ష్మీకుమారిని సన్మానించిన కళాశాల యాజమాన్యం





కృష్ణాతీరంలో అడుగుల సవ్వడి

వేసవిలో హీట్‌ను బీట్ చేస్తామంటున్న కృష్ణా రివర్ వాకర్స్

వారంతా వివిధ వృత్తుల్లో రిటైర్డ్ అయిన వారు, పలు ప్రాంతాలకు చెందిన వారు. 35 ఏళ్ల కిత్రం కృష్ణమ్మ వారందరినీ శాండ్ వాక్ పేరుతో ఒకచోట చేర్చింది. అప్పటి నుంచి వారి స్నేహబంధం 3 దశాబ్దాలుగా కొనసాగుతోంది. ప్రతిరోజు కలిసేవారు, ఒకరిని ఒకరు చూసుకోనిదే ఉండలేరు. ఎక్కడికైనా కుటుంబ సభ్యుల్లా కలిసి వెళ్తారు. కృష్ణా తీరాన్ని చూడకపోతే, ఆ గాలి పీల్చకపోతే, ఆ నీటిని తాకకపోతే, ఏదో కోల్పోయిన భావన కలుగుతుందని అంటున్నారు.

- ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం







- కృష్ణాతీరంలో ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మికత
- కనకదుర్గవారధి కింద శాండ్ వాక్, యోగా, స్విమ్మింగ్
- భవానీ జల శంకరాలయంలో పూజలు
- తారు రోడ్డు, మట్టి రోడ్డు వాకింగ్ కన్నా శాండ్ వాకింగ్ బెస్ట్ అంటున్న వాకర్లు

విజయవాడ నగరంలోని కనకదుర్గావారధి దిగువన కృష్ణాతీరంలో ఇసుకలో వాకింగ్, స్విమ్మింగ్, యోగా చేసేందుకు ఎంతోమంది క్యూ కడుతున్నారు. వారిలో 30 ఏళ్లుగా నిరంతరాయంగా వస్తున్నవారూ ఉన్నారు. వాకింగ్, స్విమ్మింగ్ తరువాత భవానీ జల శంకరాలయంలో పూజలు చేస్తూ, ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకుంటున్నారు. భక్తి, ఆరోగ్యంపై ఆసక్తితో ప్రతిరోజూ అక్కడికి వెళుతున్న కృష్ణా రివర్ శాండ్ వాకర్స్ అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నారు. యోగాసనాలు, బ్రీతింగ్ ఎక్సర్ సైజులు ఆరోగ్యానికి ఎంతోమేలు చేస్తాయని, వాటితో పాటు స్విమ్మింగ్ వల్ల శ్వాస వ్యవస్థ బలపడుతుందంటున్నారు. 70వ దశకంలోనూ బీపీ, షుగర్ సమస్యలు లేకపోవడానికి శాండ్ వాక్, ఆధ్యాత్మిక భావన, యోగాసనాలే కారణమంటున్నారు. ఇక్కడ ఒక్కసారి వాకింగ్‌కు అలవాటు పడితే, ఏళ్ల తరబడి ఆపలేరంటున్నారు. వరదల సమయంలో తప్ప, ఎప్పుడూ విరామం తీసుకోలేదని, 60, 70 ప్లస్ వయసులోనూ ఆరోగ్యంగా ఉండాలంటే, కృష్ణాతీరాన్ని తప్పక తాకాలంటున్నారు వాకర్స్ మాకు ఆరోగ్యాన్నిచ్చే కృష్ణా నదిలోని జీవరాసులకు హాని జరగకుండా, సబ్బులు, షాంపూల వాడకాన్ని పూర్తిగా నిషేధించామని చెబుతున్నారు. నేటి వేగవంతమైన జీవితంలో ఊబకాయం, అనారోగ్యాలతో బాధపడే యువతకు శాండ్ వాకర్స్ మార్గదర్శకంగా నిలుస్తారనడంలో సందేహం లేదు. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అంటూ వారు తమ అనుభవాలను పంచుకుంటూ, ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవాలో చూపిస్తున్నారు.

3 దశాబ్దాల బంధం
పుట్టగుంట వెంకటేశ్వరరావు



నేను 33 ఏళ్లుగా స్విమ్మింగ్‌కు వెళుతున్నా. ఒకరోజు స్విమ్మింగ్‌కు వెళ్లకపోతే ఏదో కోల్పోయానన్న భావన. వాకింగ్‌కు వెళ్లబట్టే నేటికీ బీపీ, షుగర్ లాంటి సమస్యలు లేవు. భక్తి, ఆరోగ్యం ఒకేచోట దొరుకుతుండటంతో ఆసక్తి చూపుతున్నాం. మిత్రులతో కాలక్షేపానికి కృష్ణాతీరం సరైన వేదిక.

వాకర్స్, స్విమ్మర్స్ స్నేహం ఇది
గుత్తికొండ శివన్నారాయణ



నేను 35 ఏళ్ల నుంచి కృష్ణా తీరానికి వెళుతున్నా. మొదట్లో పటమటలంక నుంచి కలిసి వెళ్లేవాళ్లం. 30 ఏళ్లకు పైగా వాకర్స్ అండ్ స్విమ్మర్స్‌గా స్నేహం కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఏ ఊరు వెళ్లాలన్నా కలిసే వెళతాం. కార్తీకమాసం, శివరాత్రి పర్వదినాల్లో తలో చేయి వేసి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం.

తీరానికి వస్తే స్నేహం.. ఆరోగ్యం: నయిముల్లా



కృష్ణా తీరానికి వస్తే స్నేహం, ఆరోగ్యం రెండు లభిస్తాయి. అందుకే ఉదయాన్నే శాండ్ వాకింగ్ చేస్తాం. సతీపమేతంగా వాకింగ్‌కి వస్తా. కృష్ణా తీరంలో నడక, యోగా, శ్వాసపై ధ్యాస అన్ని అనారోగ్యాలను దూరం చేస్తుంది. నలుగురితో మాట్లాడటంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఇక్కడకు చిగురించిన స్నేహం ఎన్నేళ్లయినా కొనసాగుతుంది.



ఆరోగ్యానికి ఆయువుపట్టు: నిమ్మగడ్డ సుబ్బారావు



దాదాపు 35 ఏళ్ల నుంచి కృష్ణానదితో అనుబంధం ఉంది. శాండ్ వాక్ చేశాక యోగాసనాలు వేస్తే ఆరోగ్యానికి ఆయువుపట్టు. ఈరోజు వరకు మందులుగానీ, ఆసుపత్రికి వెళ్లడం గానీ ఎరుగం. ఒక రోజు కృష్ణానదికి వెళ్లకపోతే నిరుత్సాహంగా ఉంటుంది. మాకు మార్గదర్శనం చేసిన వారు చెన్నుపాటి శేషగిరిరావు, ఐలాపురం వెంకయ్య. ఎక్కడికి వెళ్లినా వాకర్స్ అందరం కలిసికట్టుగా వెళతాం.

దైవదర్శనం.. ఆ తర్వాత యోగా
తాడికొండ రత్నకుమార్



18 ఏళ్లు వచ్చినప్పటి నుంచి అంటే 22 ఏళ్లుగా వెళుతున్నాం. విజయవాడ క్లబ్ దగ్గర ఉండే వాళ్లం పోలీస్ కానిస్టేబుల్ ట్రయినింగ్‌కు వెళ్లాం. రన్నింగ్, లాంగ్ జంప్ ప్రాక్టీస్ కోసం మొదలు పెట్టాం. అలవాటుగా మారిపోయింది. ఇసుకపై నడవడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఒక రోజు వెళ్లకపోయినా ఏదో కోల్పోయామన్న భావన.

జీవితానికి హ్యాపీ స్టార్ట్ : తాడికొండ శ్రీనివాసరావు



ఆహ్లాదం, ఆరోగ్యం ఒకే సమయంలో లభిస్తాయి. మంచి ఫ్రెండ్స్‌తో కబుర్లు ఓ ఆటవిడుపుగా ఉంటుంది. నిత్యం పని ఒత్తిడిలో ఉండే మాకు ఇది రిలీఫ్. రోజువారి జీవనం నుంచి ఈ 2గంటలు ఎంతో ఉపశమనం కలుగుతుంది. జీవితానికిది ఓ హ్యాపీ స్టార్ట్ లాంటిది. వాకింగ్, స్విమ్మింగ్, ప్రేయింగ్ అన్ని కలిసివస్తాయి.



చైత్ర దీపికను అభినందిస్తున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

రోలర్ స్కేటింగ్‌లో చైత్రదీపికకు పతకాలు

విజయవాడ స్పోర్ట్స్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): తైవాన్‌లో గత నెల 24 నుంచి 30 వరకు జరిగిన తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపిటీషన్స్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పి.చైత్రదీపిక భారత జట్టు తరఫున పలు విభాగాల్లో పతకాలు సాధించింది. పెయిర్ (దీపిక, కైవల్య) స్కేటింగ్ విభాగంలో బంగారు పతకం, ఇన్‌లైన్ విభాగంలో కాంస్య పతకం, కపుల్ (చైత్రదీపిక, కైవల్య) డాన్స్ విభాగంలో రజత పతకాలు మొత్తం మూడు పతకాలు సాధించి దేశానికెంతో పేరు తెచ్చింది. ఈ సందర్భంగా చైత్ర దీపిక స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడును మర్యాదపూర్వకంగా కలిసి తైవాన్‌లో సాధించిన పతకాల గురించి వివరించింది. దీంతో ఆయన దీపికను అభినందించి భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించి దేశానికి పేరుతేవాలని సూచించారు.

రోస్టర్‌లో లోపాలు సరిదిద్దాలి

- పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ

గాంధీనగర్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై రోస్టర్‌లో లోపాలను సరిదిద్ది మాదిగలకు 7, మాలలకు 7, ఉపకులాలు 1 శాతం రిజర్వేషన్లు కేటాయించి సమన్యాయం చేసేలా ఈనెల 3న జరగబోయే మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. మాలలకు తలొగ్గి రోస్టర్‌లో లోపాలను సరిదిద్దకుంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్‌లోని కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. రోస్టర్‌లో మాలలకు 8, మాదిగలకు 6 రిజర్వేషన్లు ఇవ్వాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఆయన తప్పుబట్టారు. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. వర్గీకరణకపై ఆర్డినెన్స్ కాదు, అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తాం

గన్నవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పని కల్పిస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వచ్చే మూడు నెలలకు కూలీలకు పని కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం పంచ ప్రాధాన్యాల పేరిట గ్రామాల్లో పనులు కల్పించనుందన్నారు. గన్నవరం శివారు మర్లపాలెంలో తవ్విన పంట కుంటలను, ఉద్యానవన పంటలకు పాదులు చేయటం వంటి పనులను మంగళవారం ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వీకే షణ్ముఖ్‌కుమార్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శశిభూషణ్‌కుమార్ మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద కొత్త పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వేసవిలో పశువుల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా 15వేల తాగునీటి తొట్టెలను నిర్మించేందుకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. ఏప్రిల్ 15 నాటికి నిర్మాణాలు పూర్తి చేసి, పశువులకు తాగునీటి సమస్యలు లేకుండా చేస్తామన్నారు. ఉపాధి హామీ పథకం అమల్లో ఏప్రిల్, మే, జూన్ నెల లు ఎంతో కీలకమన్నారు. పనులు లేక పెద్ద మొత్తంలో కూలీలు ఖాళీగా ఉండే సమయాన్ని గుర్తు చేస్తూ, ప్రతి గ్రామ పంచా యతీలో అవసరమైన పనులను గుర్తించి ప్రతి ఒక్కరికీ పనులు కల్పిస్తామన్నారు. కూలీలకు వేతనంతో పాటు రాష్ట్రంలోని ఆయా గ్రామాలకు సీసీరోడ్లు ఉద్యానవన సంరక్షణ, నీటి కుంటలు తదితర పన్నుల రూపంలో సంపద లభిస్తుందన్నారు. వీటన్నింటిని ప్రణాళికబద్ధంగా ముందుకు తీసుకువెళితే ఉపాధి హామీ పథకం అమల్లో రాష్ట్రం ముందంజలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జాబ్ కార్డులోని కుటుంబ సభ్యులందరికీ 100 రోజులు పనిదినాలు కల్పించటం జరిగిందని, అయితే అభ్యర్థనలు వస్తున్న మేరకు ఎక్కువ పని దినాల కల్పనకు ప్రయత్నిస్తామన్నారు. 52 కరువు మండలాల ప్రాంతాల్లో 150 రోజుల పని దినాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం, డ్వామా పీడీ శివ ప్రసాద్ యాదవ్, పశుసంవర్థక అధికారి చిన నరసింహులు, డీపీవో జె.అరుణ, ఎంపీడీవో టి.స్వర్ణలత, తహసీల్దార్ కేవీ శివయ్య, ఏపీవో రాజు పాల్గొన్నారు.

- పంచ ప్రాధాన్యాల పేరిట గ్రామాల్లో పనులు
- 15వేల పశువుల తాగునీటి తొట్టెల నిర్మాణానికి చర్యలు
- పీఆర్, ఆర్డీ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్



మర్లపాలెంలో పంట కుంటలను పరిశీలిస్తున్న పీఆర్, ఆర్డీ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఎన్ఆర్ఈజీఎస్ డైరెక్టర్ వికె షణ్ముఖ్‌కుమార్, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ



మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యులతో మంత్రి సత్యకుమార్ యాదవ్

రోగులను మానవత దృష్టితో చూడాలి

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రభుత్వాసుపత్రి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైద్యులు రోగులను మానవతా దృష్టితో చూడాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీలో మంగళవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ నూతన సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం మాట్లాడుతూ వైద్యులను దేవుళ్లుగా పిలుస్తారని కానీ ఇప్పుడు కొన్ని ప్రాంతాల్లో వైద్యం వ్యాపారంగా మారిపోవడంతో వైద్య వృత్తి విలువలు పల్చబడ్డాయని అభిప్రాయపడ్డారు. అవసరం లేకుండానే ఎక్సరేలు, సిటీ స్కానింగ్, ఎమ్మార్ఐ స్కానింగ్‌లు తీస్తున్నారన్నారు. నార్మల్ డెలివరీ అయ్యే అవకాశం ఉన్నా అవసరం లేకున్నా సిజేరియన్ ఆపరేషన్ చేయడం బాధాకరమన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు వైద్యులు గర్భిణులకు నార్మల్ డెలివరీ చేస్తే మంచిదన్నారు. ప్రజలకు కూడా పలు రకాల టెస్టులు చేస్తేనే డాక్టర్లు మంచివారనే అపోహలోకి ఉన్నారన్నారు. అలాంటి వారికి అవగాహన కల్పించాలన్నారు. డాక్టర్ల సర్టిఫికెట్లను ప్రతి ఐదేళ్లకొకసారి ఏపీఎంసీలో రెవెన్యూవల్ చేసుకోవాలన్నారు. ఈ విషయంలో నూతన కౌన్సిల్ డాక్టర్లు శ్రద్ధ పెట్టాలన్నారు. ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ రిజిస్ట్రేషన్‌పై సమస్యలున్నాయన్నారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల్ని ఏపీఎంసీ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్‌కు ఆరుగురు సభ్యులను నామినేటెడ్ పోస్టుల్లో నియమించినట్టు చెప్పారు. ఇంకా నలుగురు ఎక్స్ అఫీషియో మెంబర్లు, 13 మంది ఎలక్టెడ్ సభ్యులు ఎన్నుకోవాల్సి ఉందన్నారు. మొత్తం 23 మంది సభ్యులు ఏపీఎంసీలో ఉంటారన్నారు. మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్లను ఎన్నుకోవాల్సి ఉందన్నారు.

సరుకు రవాణాలో తగ్గేదే లేదు..!

- ఉత్తమ పనితీరు కనబర్చిన విజయవాడ రైల్వే డివిజన్



రైల్వే స్టేషన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే డివిజన్ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సరుకు రవాణాలో ఉత్తమ పనితీరును కనబరిచింది. 38.322 మిలియన్ టన్నుల సరుకును లోడింగ్ చేసింది. 2014-15లో కేవలం 38.169 మిలియన్ టన్నులు మాత్రమే రవాణా చేయగా, పదేళ్లలో అధిక సరుకును రవాణా చేయటానికి విజయవాడ డివిజన్ సరుకు రవాణ ఆదాయంలోనూ మెరుగు కనబరిచింది. గతం కంటే 4.3 శాతం పెరుగుదలను నమోదు చేసింది. ఆయా గణాంకాలను డివిజన్ అధికారులు వివరించారు. ఇక కోచింగ్ ఆదాయానికి వస్తే 2023-24లో రూ.94.62 కోట్లు రాగా, 2024-2025లో రూ.111.70 ఆదాయం వచ్చింది. అంటే గత ఏడాది కన్నా 18శాతం పెరుగుదల. ఇదే సమయంలో గత ఆర్థిక సంవత్సరంలో 62.7 మిలియన్ల మంది ప్రయాణించగా, అంతకు ముందు సంవత్సరంలో 63.6 మిలియన్ల మంది మాత్రమే ప్రయాణించారు. 4.8 శాతం పెరుగుదల కనపడింది. దీంతో డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ సరుకు రవాణా కస్టమర్లకు, ప్రయాణికులకు అభినందనలు తెలిపారు. సరుకు రవాణాలో కీలక పాత్ర వహించిన సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు అంకితభావాన్ని అభినందించారు. రికార్డు బ్రేకింగ్ పనితీరును ప్రదర్శించిన డివిజన్ అధికారులు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు.

విజయవాడ - గూడూరు ప్యాసింజర్ రైళ్లు రద్దు

3వ లైన్ పనులు జరుగుతున్న నేపథ్యంలో గూడూరు - ఒంగోలు సెక్షన్ మధ్య టంగుటూరులో నాన్ ఇంటర్ లాకింగ్ పనులు జరుగుతున్న దృష్ట్యా గూడూరు - విజయవాడ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేశారు. ఈనెల 4 నుంచి 8 వరకు 67225 విజయవాడ - గూడూరు, ఈనెల 5 నుంచి 9 వరకు 67226 గూడూరు - విజయవాడ రైలు, ఈనెల 8న, 17259 నెల్లూరు - విజయవాడ రైళ్లను రద్దు చేసినట్టు డివిజనల్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూపకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వివిధ సంఘాల నేతలు

సమాజంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

- మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజల మధ్య విద్వేషాలు పెంచేందుకు పాలకులు చేస్తున్న కుట్రల నేపథ్యంలో సమాజంలో శాంతిని నెలకొల్పి ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని మాజీ మంత్రి, రైతు ఉద్యమ సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. సొసైటీ ఫర్ కమ్యూనల్ హార్మనీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 13న సిద్ధార్థ అకాడమీ ఆడిటోరియంలో నిర్వహించే రాష్ట్రస్థాయి సమైక్యతా శంఖారావం సదస్సు సన్నాహక ప్రజా సంఘాల సమావేశం మంగళవారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో జరిగింది. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వడ్డే మాట్లాడుతూ ప్రజాస్వామ్య లౌకిక ప్రజాతంత్ర వాదులు పెద్దసంఖ్యలో సమావేశానికి హాజరుకావాలని కోరారు. సమావేశంలో సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లి విల్సన్, న్యూ డెమొక్రసీ పార్టీ కార్యదర్శి కె. పోలారి, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం నేతలు షేక్ బాజీ, రైతు సంఘం నేత ఆర్. రవీంద్రనాథ్, కార్మిక సంఘ నేతలు పి. అజయ్‌కుమార్, వెంకటసుబ్బయ్య, సాహిత్య, సాంస్కృతిక సంఘాల ప్రతినిధులు అరసం అరుణకుమార్, అరసవిల్లి కృష్ణ, చంద్రానాయక్, ఆర్. పిచ్చయ్య, అప్పర్, విజయప్రకాష్, ఎన్ లక్ష్మణరావు, శివనాగమణి, రాజారావు, జమలయ్య, యలమందరావు, సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నేతలు

విద్యార్థులను ప్రభుత్వ బడిలో చేర్పిద్దాం

- ఉపాధ్యాయులకు యూటీఎఫ్ పిలుపు

గవర్నర్‌పేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో ఉపాధ్యాయులు క్రియాశీలకంగా వ్యవహరించాలని, తల్లిదండ్రులు, సమాజం వద్దకు వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో ఉండేటట్టు బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులకు యూటీఎఫ్ పిలుపునిచ్చింది. ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ బడిలో విద్యార్థుల్ని చేర్పిద్దాం అనే పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ పాలకుల విధానాల ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమేపీ తగ్గుముఖం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బడి ఈడు పిల్లల్లో 49శాతం మంది మాత్రమే ప్రభుత్వ బడుల్లో చదువుతుండగా, 51శాతం మంది ప్రైవేట్ బడుల్లో చదివే వారుడడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పోస్టర్ ఆవిష్కరణలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమకుమారి, రాష్ట్ర కార్యదర్శి ఎస్‌పీ మనోహర్‌కుమార్, నేతలు హనుమంతరావు, ఏ గోపాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, ఏ. సుందరయ్య, పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు

- బైకర్ పరిస్థితి ఆందోళనకరం



రోడ్డు ప్రమాదంలో తిరగబడిన కారు

గూడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారిపై చిట్టి గూడూరు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలయ్యాయి. పాలకొల్లుకు చెందిన పి. దామోదరరెడ్డి, సి. రామారావు, బేబీ, మరో మహిళ కారులో విజయవాడ నుంచి పాలకొల్లు వెళుతుండగా, విజయవాడకు చెందిన ఎస్.ఫణి తన ద్విచక్ర వాహనంపై మచిలీపట్నం వైపు వస్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు ఫణి ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొంది. దీంతో ఫణికి బలమైన గాయాలయ్యాయి. కారు వేగంగా వెళ్లి పక్కనే ఉన్న పంట బోదెలో తిరగబడింది. కారులో ప్రయాణిస్తున్న దామోదరరెడ్డి, రామారావు, బేబీ మరో మహిళకు గాయాలవగా వీరిని బందరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫణి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్సకు విజయవాడ తరలించారు. గూడూరు ఎస్ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆ సమయంలో విజయవాడ నుంచి మచిలీపట్నం వస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రోడ్డు ప్రమాదాన్ని చూసి రోడ్డు మొత్తాన్ని సిబ్బందితో క్లియర్ చేయించారు. వెంటనే అంబులెన్స్‌లను సంఘటనా స్థలానికి పంపించారు.

ప్రతి కుటుంబంలోనూ ఒక పారిశ్రామికవేత్త ఉండాలి



- పారిశ్రామిక యూనిట్లకు రూ.3.20 కోట్ల ప్రోత్సాహకాలకు ఆమోదం: కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త ఉండాలనేది సీఎం చంద్రబాబు దార్శనికతని, రాష్ట్ర ప్రభుత్వం ఈ దిశగా తీసుకొంటున్న చర్యల్లో అధికారులు కీలక భాగస్వాములు కావాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా పారిశ్రామిక, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డీఐఈపీసీ) సమావేశం జరిగింది. పారిశ్రామిక విధానాల కింద పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, పారిశ్రామిక అనుమతులపై చర్చించారు. 2024, డిసెంబరు 19 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా పారిశ్రామిక అనుమతులకు సంబంధించి 105 దరఖాస్తులు స్వీకరించగా, 90 ఆమోదం పొందాయని పరిశ్రమల శాఖ అధికారులు వివరించగా, మిగిలిన దరఖాస్తులను కూడా నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఎల్‌డీఎం కె.ప్రియాంక, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ కె. బాబ్జి, డీపీవో పి.లావణ్యకుమారి, పీసీబీ ఈఈ పి.శ్రీనివాసరావు, జిల్లా అగ్నిమాపక అధికారి ఏవీ శంకరరావు తదితరులు హాజరయ్యారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ మెరుగైన సేవలు

- కృష్ణాజిల్లా కలెక్టర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించేలా వైద్యాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకంపై వచ్చిన ఫిర్యాదులపై మంగళవారం తన చాంబర్‌లో జిల్లా క్రమశిక్షణా కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా ప్రైవేటు ఆసుపత్రుల్లో పేద వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలన్నారు. ఉద్యోగులకు సంబంధించి ఆరోగ్యపథకం (ఈహెచ్ఎస్) ద్వారా వైద్యసేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల ప్రభుత్వం ఈహెచ్ఎస్ బిల్లులను చెల్లించడం జరిగిందన్నారు. డీఎంహెచ్‌వో శర్మిష్ట, డీసీహెచ్ఎస్ ఎం జయకుమార్, జిల్లా ఎన్టీఆర్ వైద్యసేవల విభాగం సమన్వయ అధికారి ఎస్‌బీ సతీష్, కమిటీ సభ్యుడు కేశవకృష్ణ, పలువురు ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ సక్రమంగా చేయండి

మచిలీపట్నం మునిసిపల్ కార్పొరేషన్‌లో పోలింగ్‌కేంద్రాల పునర్వ్యవస్థీకరణ సక్రమంగా చేయాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ పోలింగ్ కేంద్రాల పునర్వ్యవస్థీకరణపై సమావేశం నిర్వహించారు. నియోజకవర్గంలో 205 పోలింగ్ కేంద్రాలు, నగరంలో 135 పోలింగ్ కేంద్రాలున్నట్టు తెలిపారు. డీఆర్‌వో కే చంద్రశేఖరరావు, ఇన్‌చార్జి ఆర్‌డీవో సీహెచ్ పద్మావతి, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ బాపిరాజు, మచిలీపట్నం తహసీల్దార్‌లు మధుసూదనరావు, నాగభూషణం, ఎన్నికల విభాగం అధికారులు నారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	167, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450

జూనియర్ అసిస్టెంట్ బి.సాంబశివరావుకు సన్మానం



సాంబశివరావు దంపతులను దుశ్శాలువాతో సత్కరిస్తున్న ఉద్యోగులు

పెదపారుపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ కాబడిన జూనియర్ అసిస్టెంట్ బి.సాంబశివరావుని పెదపారుపూడి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఏపీజీఈఏ (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం) పెదపారుపూడి - పామర్రు యూనిట్ తరపున మంగళవారం ఘనంగా సన్మానించారు. ఆ సంఘ అధ్యక్షులు కొలుసు ఏసుబాబు, కార్యదర్శి ఎం.విజయకుమార్, కోశాధికారి జి.శివనాగమణి, ఉపాధ్యక్షులు బి.చంద్రశేఖర్, కె.విజయ్ కుమార్ , సంఘ సభ్యులు, సీనియర్ అసిస్టెంట్ మెహరున్నీసా బేగం, జూనియర్ అసిస్టెంట్ స్వరూప్ కుమార్‌లు దుశ్శాలువాతో సత్కరించారు.



చెక్కులను అందజేస్తున్న టీడీపీ నాయకులు

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

గుడివాడ, ఏప్రిల్ 01(ఆంధ్రజ్యోతి) : ఆపత్కాలంలో నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంలో సీఎంరిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తుందని టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ(నాని) అన్నారు. మంగళవారం స్థానిక ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో నందివాడ మండలం ఒద్దుల మెరక గ్రామానికి చెందిన మెరుగుమాల వెంకటేశ్వరరావుకు వైద్య చికిత్స నిమిత్తం రూ.1లక్ష ఎల్‌వోసి, సత్యనారాయణపురానికి చెందిన అల్లాడి రమణ అనే మహిళకు రూ.60వేల చెక్కులను అందజేశారు. తుమ్మలపల్లి గ్రామ సర్పంచ్ సింగాల రాధాకృష్ణ, టీడీపీ నాయకులు రాంబాబు, ప్రభాకర్, సాంబశివరాజు, రాజు పాల్గొన్నారు.



భూమి పూజలో పాల్గొన్న ఎంపీడీవో విజయసారథి

పశువులకు తాగునీటి తొట్ల నిర్మాణం

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) :మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ నిధులతో మండలంలోని పలుగ్రామాల్లో పశువులకు తాగునీటి తొట్ల నిర్మాణం చేయనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.విజయసారథి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం కౌతవరంలో తాగునీటి తొట్లు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో పశువుల తొట్టికు రూ. 33 వేల అంచనాలతో పనులు చేపట్టామన్నారు. కౌతవరం, డోకిపర్రు, వడ్లమన్నాడు, వెణుతురుమిల్లి, చంద్రాల, పోలిమెట్ల, కట్యానిచెరువు గ్రామాల్లో తొలివిడతగా పశువుల తొట్టెలను నిర్మిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ అధికారులు, ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



మోటూరులోని సీతారాములస్వామి దేవాలయం

గుడివాడ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మోటూరులోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో సీతారామస్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించడానికి ఆలయ ఈవో, ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ వంశస్థులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో గొరిపర్తి నాగమౌనిక మాట్లాడుతూ స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ఈ నెల 4వ తేదీ నుంచి పదో తేదీ వరకు జరుగుతాయన్నారు. సీతారామస్వామి ఉత్సవాల సందర్భంగా 4వ తేదీ శుక్రవారం మంగళవాయిద్యం, ధ్వజారోహణ, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రుత్విగర్వణ, రక్షాబంధన తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు. 5వ తేదీ తెల్లవారుజామున తిరువారాధన, నిత్యహోమం, గ్రామ బలిహరణ, పెండ్లి కుమారుడిని తిరువీధుల్లో గ్రామోత్సవం జరుగుతుందని వివరించారు. 6వ తేదీ సీతారామస్వామి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించడానికి సకల ఏర్పాట్లు పూర్తి చేశా మన్నారు. ఆ రోజు మధ్యాహ్నం 12.30 నిమిషాలకు స్వామి తిరుకల్యాణ మహోత్సవాన్ని శ్రీరంగం నల్లాన్ చక్రవర్తులు వివేక్ తదితరుల ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించనున్నామన్నారు. రాత్రి గరుడ వాహనంపై గ్రామోత్సవం వైభవంగా నిర్వహించటానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 7వ తేదీన పొన్నవాహనోత్సవం, సీతారామస్వామి పట్టాభిషేకం నిర్వహిస్తారు. 8వ తేదీ అత్యంత అద్భుతంగా రథోత్సవం నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 9వ తేదీ వసంతోత్సవం నిర్వహించటానికి ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. ఆలయ ట్రస్టీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఆనందాసు వెంకట రామయ్య నాయుడు, మానేపల్లి సురేష్, గంటా వంశీ, గంగనవల్లి రాజలక్ష్మి, యార్లగడ్డ నాగమణి, కోడూరు సుధారాణి, గురువెల్లి సంతోషిణి, పంతగాని స్వాతి, ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో సీతారామస్వామి కల్యాణ మహోత్సవాలు నిర్వహించటానికి సకల ఏర్పాట్లు చేశారు. రెవెన్యూ, దేవాదాయ, ధర్మదాయ, పోలీసు తదితర శాఖల ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పాలకవర్గం అందరూ కలసి మోటూరును సర్వాంగసుందరంగా అలంకరిస్తున్నారు. దేవాలయం వద్ద వారం రోజులపాటు వివిధ రకాల షాపులు నిర్వహించుకోవటానికి ఇప్పటి నుంచే ఆశావాహులు ఆలయం చుట్టుపక్కల పరిసరాలకు వచ్చారు. కృష్ణా జిల్లాలో పేరెన్నికగన్న సీతారామస్వామి తిరు కళ్యాణం తిలకించటానికి రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మౌలిక వసతులు కల్పించామన్నారు.

పామర్రు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన హనుమాన్ దేవాలయాల్లో ఒకటిగా బాసిల్లుతున్న పామర్రులోని ఉంగ్రపూడి-పోలవరం అడ్డరోడ్డు వద్ద గల వీరాంజనేయస్వామి దేవస్థానంలో శ్రీరామనవమి కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు ఘనంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా ఆలయం వద్ద నిర్వహించే కార్యక్రమాలను ఆలయ అధికారి వీవీఎన్‌వీ ప్రసాదరావు మంగళవారం విలేకరులకు వివరించారు. ఆదివారం ఉదయం 9.45 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, సోమవారం ఆలయం వద్ద 20 వేల మంది భక్తులకు మహాన్నదానం ఏర్పాట్లు చేశామన్నారు. సాంస్కృతిక, ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు చెప్పారు. కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయాన్ని ప్రత్యేక రంగులతో అలంకరించారు. చలువ పందిళ్లు నిర్మించారు. ఈ కార్యక్రమంలో కల్యాణోత్సవ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



పామర్రులో ముస్తాబైన వీరాంజనేయస్వామి దేవస్థానం



సామాజిక పింఛన్లను అందజేస్తున్న సచివాలయ సిబ్బంది, టీడీపీ నేతలు

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

గుడివాడ, ఏప్రిల్ 01 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం పేదలకు భద్రత కల్పిస్తూ నూతనంగా మంజూరు చేసిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను మంగళవారం సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. స్థానిక 11వ వార్డులో భరోసా పింఛన్లను టీడీపీ నాయకులు సయ్యద్ జబీన్, సయ్యద్ గఫార్, పట్టపు చిన్న, అస్మాలు అందజేశారు. స్థానిక 36వ వార్డు నాగవరప్పాడులో టీడీపీ నాయకులు మెరుగుమాల బ్రహ్మయ్య, దాసరి సురేష్, అడ్మిన్ కార్యదర్శి ప్రసన్నవల్లి తదితరులు అందజేశారు.

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు మంగళవారం 94.67 శాతం పంపిణీ చేశారు. 6964 మందికి రూ.3.15 కోట్లు పంపిణీ చేయాల్సి ఉండగా 6593 మందికి రూ.2.83 కోట్లు పంపిణీ చేశారు. గుడ్లవల్లేరులో 6 గురికి నూతన పింఛన్లు , 8మందికి వితంతు పింఛన్లను పొట్లూరి రవికుమార్, చాపరాల బాలాజీలు పంపిణీ చేశారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

● ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

పమిడిముక్కల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పడిన సంవత్సర కాలంలోనే పమిడిముక్కల మండలంలో రూ.10కోట్లతో అభివృద్ధిపనులు చేశామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పేర్కొన్నారు. హనుమంతపురంలో రూ. 23.5 లక్షలు ఎన్ఆర్‌ఈజీఎస్, రూ. 4.5 లక్షల డీఎంఎఫ్ నిధులు కలిపి రూ.28 లక్షలతో నిర్మించిన 7 సీసీ రోడ్లకు మంగళవారం స్థానిక నాయకులు లింగమనేని బాబూరావుతో కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో ఆర్‌అండ్‌బీ రోడ్లకు రూ. 3కోట్లు మంజూరయ్యాయని, త్వరలో వాటికి టెండర్లు పిలిచి పనులు చేపడతారన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే రూ.28లక్షలతో పంట కాల్వల పూడిక తీతపనులు జరుగుతున్నాయన్నారు. రూ.1.10 కోట్లతో వేల్పూరులో కాల్వపై వంతెన పనులు ప్రారంభమవుతాయన్నారు. పామర్రులో రూ. 3 కోట్లతో ఎస్సీ బాలికల హాస్టల్, మొవ్వలో రూ. 3కోట్లతో ఎస్సీ బాలుర హాస్టల్ నిర్మించనున్నట్టు తెలిపారు. హనుమంతపురం పరిధిలో ఐనంపూడి, సూరయ్య కాల్వలు ఆక్రమణలతో పూడుకుపోయి పొలాలకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గ్రామపార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జునరావు, రమణ, శ్రీనివాసరావు, సర్పంచ్ రాంబాబు, మహేశ్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, పృద్వీరాజ్, లక్ష్మి పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారమే లక్ష్యం

● టీడీపీ నేత వెనిగండ్ల రామకృష్ణ



బిందెలలో నీళ్లు పట్టి మహిళలకు అందిస్తున్న రామకృష్ణ

నందివాడ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్వర్గీయ గాదిరాజు వెంకట రామరాజు జ్ఞాపకార్థం కుమారులు నాగరాజు, రామకృష్ణరాజు, కోటిపల్లి ధర్మరాజు , స్వర్గీయ తేరాబత్తుల పోతురాజు, సంపూర్ణమ్మల జ్ఞాపకార్థం కుమారుడు చిన్నసుబ్బరాజు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్‌ను మంగళవారం టీడీపీ నాయకులు వెనిగండ్ల రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఎమ్మెల్యే రాము కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వాటర్ ప్లాంట్ నిర్మాణానికి సహకరించిన దాతలను, మండల టీడీపీ నాయకులను అభినందించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పెదపారుపూడి డీసీ చైర్మన్ యార్లగడ్డ రవి, చేకూరి జగన్మోహనరావు, అందుగుల ఏసుపాదం, సింగాల రాధాకృష్ణ, చింతా కమలయ్య, మద్దాల రాజేష్, గొల్లపల్లి నాగబాబు, సాల్మన్ రాజు, టీడీపీ నాయకులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు

ముగిసిన పదో తరగతి పరీక్షలు



నందివాడలో పరీక్షలు రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

కూచిపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మార్చి నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. మొవ్వ మండలంలోని కూచిపూడి, మొవ్వ, పెదసనగల్లు, నిడుమోలు, కాజ, కోసూరు ఆరు కేంద్రాల ద్వారా 530 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ముగింపు రోజు నిర్వహించిన సోషల్ పరీక్షను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పరిశీలించింది.

నందివాడ : గత నెల 17వ తేదీ నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు జరిగిన 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించినట్టు డివిజన్ డీవైఈవో రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా నందివాడ ఎస్సై శ్రీనివాస్ తన సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు.

పమిడిముక్కల : పమిడిముక్కల మండలపరిధిలో పదోతరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా ముగిశాయి. మేడూరు, పమిడిముక్కల, కపిలేశ్వరపురం, తాడంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నాలుగు పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేయగా అందులో 418 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు డీవైఈవో పద్మారాణి తెలిపారు.

పామర్రు: పదోతరగతి పబ్లిక్ పరీక్షలు మండల పరిధిలో ప్రశాంతగా మంగళవారం ముగిశాయి. మొత్తం ఐదు పరీక్షా కేంద్రాల ద్వారా చివరిరోజు సోషల్ పరీక్షకు 727మంది హాజరు కావాల్సిఉండగా వారిలో ఐదుగురు విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్టు ఎంఈవో గుమ్మడి పద్మవాణి తెలిపారు. వారిలో స్థానిక అస్సెసి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ సెంటర్లో నలుగురు , పామర్రు జెడ్పీ హైస్కూల్ ఒకరు మొత్తం ఐదుగురు చివరి పరీక్షకు గైర్హాజరయ్యారని ఆయన తెలిపారు..

డ్రంకెన్ డ్రైవ్‌లో 18 మందిపై కేసుల నమోదు

గుడివాడ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో గుడివాడ రూరల్ సీఐ ఎస్ఎల్ఆర్ సోమేశ్వరరావు పర్యవేక్షణలో గుడివాడ రూరల్ ఎస్సై ఎన్.చంటిబాబు వారి సిబ్బంది గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 18 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం మంగళవారం కోర్టు ముందు ఈ 18 మందిని హాజరుపర్చగా వారికి న్యాయాధికారి రూ.1.80 లక్షలు అపరాధ రుసుము విధించారని ఎస్సై తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపేవారు భారీ అపరాధ రుసుము చెల్లించాల్సి వస్తుందన్నారు. రెండోసారి పట్టుబడిన వారు జైలుకు సైతం వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనదారులకు ఎస్సై తెలియజేశారు.



మొవ్వలో మధ్యాహ్న భోజనానికి హాజరైన విద్యార్థులు

ఇంటర్ తరగతులు పునః ప్రారంభం

కూచిపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నుంచి ఇంటర్ తరగతులు పునఃప్రారంభమయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలతో ఇంటర్ కళాశాలను ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నారు. తొలి రోజున ఇంటర్ రెండో సంవత్సరం విద్యార్థులు 60 మంది హాజరు కాగా, నలుగురు అధ్యాపకులు విధులకు హాజరయ్యారు. మిగిలిన వారు ఈ నెల 5వ తేదీ వరకు నిర్వహించే పరీక్షా పేపర్ల వాల్యూయేషన్ అనంతరం హాజరు కానున్నారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టారు.

పశువధశాల ఆశీల బహిరంగ వేలం 3న

గుడివాడ, ఏప్రిల్ 01 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 3వ తేదీ గురువారం 2025-26 సంవత్సరమునకు పురపాలక సంఘానికి చెందిన గొర్రెల, మేకల వధశాల ఆశీలు, పశువధశాల ఆశీలు కోసం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే పలు పర్యాయాలు నిర్వహించిన వేలం పాటలో పాటదారులు హాజరు కాలేదు. దీంతో ఈ నెల 3వ తేదీన మున్సిపల్ కార్యాలయంలో మరలా వేలం పాటలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టండి : సీపీఎం

గుడివాడ, ఏప్రిల్ 01 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. గతంలో పాత బైపాస్ నుంచి వాహనాలను బయటకు పంపించేవాళ్లని, కొత్త బైపాస్ నుంచి ఏలూరురోడ్డు మీదగా కైకలూరు, మండవల్లి బస్సులను తరలిస్తున్నారన్నారు. ప్రస్తుతం పాత బైపాస్ నుంచే రాకపోకలు సాగుతుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు పెరిగాయన్నారు. ఐఎంఏ హాల్ రహదారిని బాగుచేసి, పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సి.హెచ్ శివనాగమల్లేశ్వరరావు, పి.రజిని తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు రేపు

గుడ్లవల్లేరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పలు కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకున్న ఆశావహులకు ఏప్రిల్ 3 గురువారం గుడ్లవల్లేరు మండలపరిషత్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని మండల పరిషత్ అభివృద్ధి అధికారి టి.విజయసారథి తెలిపారు. ఇంటర్వ్యూలకు వచ్చే దరఖాస్తుదారులు ఆధార్‌కార్డు, రైస్‌కార్డు, బ్యాంక్‌పాస్‌పుస్తకం, కుల ధ్రువీకరణ పత్రాల ఒరిజినల్స్‌తో పాటుగా జిరాక్స్‌లు రెండు సెట్లను తప్పనిసరిగా వెంట తీసుకుని ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన సూచించారు.

ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభం



ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్

గుడివాడ రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగంగా జరుగుతున్నాయని ఎంపీడీవో డి.వై.విష్ణుప్రసాద్ తెలిపారు. నూజెళ్లలో పంచాయతీ చెరువుకు సంబంధించిన పది లక్షల నిధులతో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీల ద్వారా పూడికతీత పనులను మంగళవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజెళ్ల గ్రామంలో అర్హత ఉన్న వారికి పని కల్పించాలని కోరారు. ప్రతి ఒక్కరికీ పని కల్పించాలనే ఉద్దేశ్యంతోనే జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉపాధి హామీ పథకం పనులను ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు, నూజెళ్ల సర్పంచ్ పఠాన్ గౌస్, ఎంపీటీసీ సింగవరపు ఝాన్సీరాణి, కార్యదర్శి వి.హరికృష్ణ, టీఏ రమేష్, కూటమి నాయకులు, ఉపాధి హామీ ఫీల్డ్‌అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



రెడ్డిపాలెం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు



మంటాడ ఆర్‌అండ్‌బీ రహదారి పక్కన తొలగించకుండా తగులబెట్టిన చెత్తాచెదారం

డంపింగ్‌యార్డుల్లా ఆర్‌అండ్‌బీ రోడ్లు

పమిడిముక్కల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మంటాడ - లంకపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో మంటాడ నుంచి రెడ్డి పాలెం వరకు రోడ్డుకు ఇరువైపులా చెత్తకుప్పలు పేరుకుపోయి డంపింగ్‌యార్డులను తలపిస్తున్నాయి. మంటాడ, తాడంకి, రెడ్డిపాలెం పరిధిలో సేకరించిన చెత్తతో పాటు స్థానికంగా నివసించేవారు సైతం చెత్తతీసుకొచ్చి రోడ్డు పక్కన పోస్తున్నారు. స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ పేరుతో ప్రభుత్వం ప్రతినెలా మూడో శనివారం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి అధికారులు పర్యటించి తనిఖీలు చేస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో అప్పటివరకు పేరుకుపోయిన చెత్తకుప్పలను పంచాయతీసిబ్బంది హడావిడిగా తగులబెట్టి చేతులు దులుపుకుంటూ మొక్కుబడిగా పనులు చేస్తున్నారు. దీంతో ప్రతి నెలా మూడో శనివారం వరకు రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తాచెదారం కుళ్లి దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామాల్లో సేకరించిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు తరలించి ఎరువులు తయారు చేయాలన్న లక్ష్యం మండలపరిధిలో దాదాపు అన్ని గ్రామాల్లో కన్పించడం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.ల్లో)

బ్రాయిలర్ బర్డ్	162, 171, 182
చికెన్ విత్ స్కిన్	310
చికెన్ స్కిన్‌లెస్	320

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 450



మునిసిపల్ కార్యాలయంలో తాగునీటికి ఇబ్బందులు



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగర పాలక సంస్థ కార్యాలయంలోని ఉద్యోగులు, కార్యాలయానికి వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు 15 రోజులుగా తాగునీరు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మినీ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో వేసవిలో దాహార్తికి కార్యాలయానికి వచ్చే ప్రజలు అల్లాడుతున్నారు. ప్లాంట్‌కు మరమ్మతులు జరిపి తాగునీటి సౌకర్యం పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

వీనుల విందుగా వేణుగానం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి కళా సమితి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి నిర్వహించిన దోణేంద్ర ఫణికుమార్ వేణుగానం వీనుల విందు చేసింది. ప్రముఖ సంగీత విద్వాంసుడు దోణేంద్ర ఫణికుమార్ కర్ణాటక సంగీతాన్ని పాశ్చాత్య సంగీతానికి జోడిస్తూ ఫ్లూట్‌పై నిర్వహించిన శాస్త్రీయ ఫ్యూజన్ సంగీత కచేరీ ప్రేక్షకులను మంత్ర ముగ్ధులను చేసింది. సరస్వతి కళా సమితి అధ్యక్షుడు సి.శేషాచార్యులు ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన జరిగింది. సంగీత విద్వాంసుడు ఫణికుమార్ సాధించెను ఓ మనసా అనే పంచరత్న కీర్తనతో వేణుగానం ప్రారంభించారు. అమృతవర్షిణి రాగంలో సుధామయి, సుధానిధే, అభేరి రాగంలో నగుమోము వేణువుపై వినిపించారు. హిందోళ రాగంలో దేవదేవం భజే కీర్తనను, సింధుభైరవి రాగంలో వెంకటాచల నిలయం అనే కీర్తనను వినిపించారు. వివిధ బాణీలను వైవిధ్యంగా వినిపించి ప్రేక్షకుల మన్ననలు పొందారు. పాశ్చాత్య సంగీతంలోని కార్డులను, కర్ణాటక సంగీతంలోని వివిధ రాగాల్లో మేళవించారు. ఫణికుమార్ ఫ్లూట్ కచేరీకి మృదంగంపై సురేష్, తబలపై శ్రీధరాచారి, కీ బోర్డుపై పవన్, ఎలక్ట్రానిక్ గిటార్‌పై యశ్వంత్ సహకరించారు. కళారత్న అవార్డు గ్రహీత, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు, సమితి ప్రధాన కార్యదర్శి జి. రామబ్రహ్మం, సంయుక్త కార్యదర్శి భవిష్య, కోశాధికారి జి.ఎస్.ఎస్. కృష్ణారావు పాల్గొన్నారు.



వేణుగానం చేస్తున్న దోణేంద్ర ఫణికుమార్



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

నిత్యాన్నదాన పథకానికి విరాళం

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మచిలీపట్నానికి చెందిన కమ్మిలి కృష్ణ ప్రసాద్ - నాగపద్మావతి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందజేశారు. మంగళవారం ఉదయం స్వామివారిని దర్శించుకుని కుమార్తెలు మానస, ఇషిత పేరున ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు విరాళం అందజేశారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టొద్దు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆప్కాస్‌ను రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ప్రైవేట్ ఏజెన్సీలకు కట్టబెట్టే చర్యలను ప్రభుత్వం విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. మచిలీపట్నం మునిసిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నాయకులు తీవ్రంగా ఖండించారు. ఏఐటీయూసీ నాయకులు కె.దుర్గాప్రసాదరావు, శీరంశెట్టి వెంకటేశ్వ రరావు, శ్రీమన్నారాయణ, సీఐటీయూ నాయకులు సిహెచ్. బుల్లెమ్మ, టి. వెంకటే శ్వరరావు, పి. సంజీవమ్మ, సిహెచ్. వీరమ్మ, సంఘం రెడ్డి కోటేశ్వరరావు, వై. విజయ, యర్రంశెట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. మునిసిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని నాయకులు డిమాండ్ చేశారు.



చిన్నాపురంలో నడకుదిటికి నివాళి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దివంగత నడకుదిటి నరసింహారావు తన సేవలతో స్ఫూర్తిగా నిలిచారని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. బందరు మండలం చిన్నాపురం గ్రామంలో మంగళవారం దివంగత నడకుదిటి నరసింహారావు సంతాప సభ జరిగింది. నడకుదిటి చిత్రపటానికి మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఎమ్మెల్యే మండలి



అవనిగడ్డ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో నియోజకవర్గ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. వేసవిలో తాగునీటి సమస్యలకు తక్షణ పరిష్కారం చూపించే పనులను గుర్తించి ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పెదకళ్లేపల్లి రక్షిత మంచినీటి పథకా నికి మైక్రో ఫిల్టర్ల ఏర్పాట్లు, చింతకోళ్ల గ్రామానికి మందపాకల నుంచి అదనపు పైపులైన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు ఇవ్వాలని, ఘంటసాల మండలం దేవరకోటలో పైపులైన్ మార్చేందుకు, యండకుదురులో పైపులైన్ విస్తరణకు ప్రతిపాదనలు ఇవ్వాలని సూచించారు. చల్లపల్లి నారాయణరావు నగర్‌లో ఓహెచ్‌ఆర్ఎస్ పథకం కోసం గురుకుల పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన బోరుకు విద్యుత్ కనెక్షన్ కోసం రూ.6 లక్షలతో అంచనాలు వేశామని, టెండర్ అంచనాలు రూ.2 లక్షలు మాత్రమే చూపించారని, మిగిలిన నాలుగు లక్షలకు మ్యాచింగ్ గ్రాంటు ఇప్పించాలని అధికారులు కోరారు. డీఈఈ పాలచర్ల సత్యనారాయణ, ఏఈలు మెండు సుగుణ కుమారి, కేసరి కిషోర్‌బాబు, ఏ.బ్రహ్మయ్య, భోగాది జగన్ తదితరులు పాల్గొన్నారు.



కృత్తివెన్నులో శాంతియుత ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



ఘంటసాల బ్యాంక్ సెంటర్‌లో ర్యాలీ



అవనిగడ్డలో డీఎస్పీకి వినతిపత్రం ఇస్తున్న పాస్టర్లు

పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ఘంటసాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేస్తూ మండల పాస్టర్ల సంఘం ఆధ్వర్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. పాస్టర్ ప్రవీణ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ, తహసీల్దార్ బి.విజయ ప్రసాద్, ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, మొవ్వ మండలాల పాస్టర్లు, సంఘ ప్రతినిధులు, విశ్వాసులు పాల్గొన్నారు.

కృత్తివెన్నులో భారీ ర్యాలీ

కృత్తివెన్ను : పాస్టర్ ప్రవీణ్ మృతి కేసులో న్యాయం చేయాలని కోరుతూ క్రైస్తవులు మంగళవారం కృత్తివెన్నులో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. సంగమూడి హైస్కూల్ దగ్గర నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ చేసి, శాంతియుతంగా నిరసన తెలిపారు. క్రైస్తవులపై దాడులు అరికట్టాలని, శాంతియుత సమాజానికి దోహదపడాలని, క్రైస్తవుల హక్కులను కాపాడలని, పాస్టర్ ప్రవీణ్ కేసులో న్యాయబద్ధంగా విచారణ జరపాలని కోరుతూ పోలీసులకు వినతిపత్రంను అందించారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడు డేనియల్ రాజు, ప్రభుదాను, ఎఫ్రా, జాన్సన్, డేనియల్, రక్షణానందం, భూపతి, యేసుబాబు, ఏసురాజు, ప్రశాంత్, అహరోన్, కృత్తివెన్ను, బంటుమిల్లి, కలిదిండి మండలాల క్రైస్తవ సంఘ నాయకులు, విశ్వాసులు పాల్గొన్నారు.

అవనిగడ్డలో డీఎస్పీ, ఎమ్మెల్యేకు వినతిపత్రం

అవనిగడ్డ : పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర దర్యాప్త కోరుతూ చేయాలని దివి తాలూకా పాస్టర్ల క్రైస్తవ వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ప్రవీణ్ మృతిపై విచారణ కోరుతూ అవనిగడ్డలో దివిసీమ పాస్టర్లు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. డిఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ, తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌లకు వినతిపత్రాలు అందజేశారు. దివిసీమ పాస్టర్స్ ఐక్యవేదిక సభ్యులు మోజెస్, జోషి, విజయ్ కుమార్, పాల్ మేయర్, విలియమ్ కేరీ, కె.విజయ్ కుమార్ పాల్గొన్నారు.



కూడూరులో పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్



కానూరులో దివ్యాంగుడికి పింఛను అందజేస్తున్న గోపు సత్యనారాయణ

వాహనాలు సీజ్

నాగాయలంక, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వక్కపట్లవారిపాలెం గ్రామంలో మంగళవారం అక్రమంగా మట్టి తరలిస్తున్న జేసీబీ, రెండు ట్రాక్టర్లు పట్టుకొని స్టేషన్‌కి తరలించినట్లు ఎస్సై కె.రాజేష్ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు రిఫర్ చేశామన్నారు.

ఆర్థిక అసమానతలు తొలగించేందుకే పీ4

పెడన రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక అసమానతలు తొలగించేందుకు ప్రభుత్వం పీ4 పథకం అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. కూడూరు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఒకేసారి నాలుగు వేల రూపాయలు అందిస్తున్నారని తెలిపారు. జడ్పీటీసీ సభ్యుడు అర్జా నగేష్, శలపాటి ప్రసాద్, శీరం ప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు. **పెడన :** రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పీ4 విధానం తీసుకువచ్చారని పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య అన్నారు. పట్టణంలోని తొమ్మిదో వార్డు సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు మంగళవారం ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. శ్యామలయ్య మాట్లాడుతూ, పీ4 వంటి మంచి కార్యక్రమానికి అందరూ సహకరించాలన్నారు. ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు బళ్ళ గంటేశ్వరరావు, ఉమ్మిటి వెంక టేశ్వరరావు, పులి రవి, యర్రా నాగేంద్రం పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్ :** బందరు మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం ఉదయం నుంచే ప్రారంభమైంది. చిన్నాపురం గ్రామంలో మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, సర్పంచ్ కాగిత గోపాలరావు, తలారి సోమశేఖర్, కుంచే నాని తదితరులు పాల్గొన్నారు. కాగా వి. కానూరు గ్రామంలో జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు.

మహిళలపై నేరాలను నియంత్రిద్దాం

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరిగే నేరాలను నియంత్రించేందుకు హెల్ప్‌లైన్ సేవలను వినియోగించుకోవాలని మహిళా పోలీసు స్టేషన్ సిఐ వాసా వెంకటేశ్వరరావు కోరారు. పోతేపల్లి బిసి గురుకుల పాఠశాలలో మంగళవారం విద్యార్థినులనుద్దేశించి వాసా వెంకటేశ్వరరావు మాట్లాడారు. శక్తి మొబైల్ యాప్‌ను ఫోనుల్లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉషారాణి, మహిళా పోలీసు స్టేసన్ ఎస్‌ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలి కృషితో తాగునీటి సరఫరా

కోడూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పని చేస్తున్న నేత ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఇరాలి, బసవవానిపాలెం ప్రజలకు మండలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 40 వేల లీటర్ల తాగునీటిని మాజీ మంత్రి స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు జ్ఞాపకార్థం సరఫరా చేయడం ముదావహమన్నారు. రామకృష్ణాపురం మాజీ సర్పంచ్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసన నేడు

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : టీచర్ల సమస్యలు పరిష్కారం కోరుతూ బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు ఫ్యాప్టో జిల్లా చైర్మన్ అంబటిపూడి సుబ్రహ్మణ్యం తెలిపారు. బందరులో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించాలన్నారు. 12వ పీఆర్సీ వెంటనే ప్రకటించాలని, డీఏ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ అమలు చేసే వరకు ఐఆర్ ప్రకటించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలని, డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని కోరారు.

భద్రాచలానికి ప్రత్యేక బస్సులు

అవనిగడ్డ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలంలో జరిగే సీతారాముల కల్యాణం చూసేందుకు వీలుగా ఏప్రిల్ 5వ తేదీన అవనిగడ్డ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కె.హనుమంతరావు తెలిపారు. ప్రత్యేక బస్సులు నడపటమే కాక, పరిసర ప్రాంత గ్రామాల నుంచి భక్తులు గ్రూపుగా భద్రాచలం వెళ్లదలిస్తే వారి కోసం గ్రామాలకు బస్సులు పంపి కల్యాణం అనంతరం వారిని తిరిగి గ్రామంలో దింపేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇతర వివరాలకు 9959225466 నెంబర్‌ను సంప్రదించాలని డిఎం సూచించారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఘంటసాల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను మంగళవారం పూషడం, గోగినేనిపాలెం గ్రామాల్లో ప్రారంభించారు. పంటబోదుల తవ్వకం పనులను పూషడం సర్పంచ్ అంకం మారుతిరావు, ఉపసర్పంచ్ గల్లా సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. ఫీల్డ్ అసిస్టెంట్ జి.కోటేశ్వరరావు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు. గోగినేనిపాలెం లో ఉపాధి హామీ పథకం పనులను టీడీపీ నాయకులు కుంపటి సుబ్బారావు, బుగ్గినేని నరసింహారావు ప్రారంభించారు. పంచాయతీ సర్పంచ్ కుంపటి సుశీల, ఉప సర్పంచ్ గణపనేని వెంకటేశ్వరరావు, ఫీల్డ్ అసిస్టెంట్ కొడాలి కొండలు, గ్రామస్థులు బోలె మోహన్, కొడాలి శ్రీనివాస్, కుంపటి చక్రవర్తి, చోరగుడి నాని, కొడాలి వంశీ, మసిముక్కు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సప్తగిరి బ్యాంకు సేవలపై ప్రచారం

చల్లపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : సప్తగిరి గ్రామీణ బ్యాంకు సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చల్లపల్లి బ్యాంక్ మేనేజర్ పి.రమేష్ కోరారు. చల్లపల్లిలో బ్యాంకు సేవలపై మంగళవారం ఆటో ప్రచారం నిర్వహించారు. స్వయంగా ప్రతి షాపు వద్దకూ వెళ్లి బ్యాంకు అందించే సేవలను వివరించారు.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి



మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం రైల్వేస్టేషన్ ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు రైల్వేపోలీసులు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఏ.ఎస్.కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు కాఫీ కలర్ ప్యాంటు, లేతపసుపు పచ్చ రంగు హాఫ్ హ్యాండ్స్ గళ్ల చొక్కా వేసుకున్నాడు. కుడి మోచేతిపై పచ్చబొట్టు ఉంది. వివరాలు తెలిసిన మచిలీపట్నం స్టేషన్ మాస్టర్‌కు తెలియచేయాలని రైల్వే పోలీసులు తెలిపారు.

టెట్ నిర్వహించాలని మంత్రి రవీంద్రకు వినతి

మచిలీపట్నం టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ పరీక్షల ముందు మరోసారి టెట్ నిర్వహించాలని మంత్రి కొల్లు రవీంద్రకు మంగళవారం పలువురు అభ్యర్థులు వినతిపత్రం సమర్పించారు. కొత్తగా డీఈడీ, బీఈడీ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగావకాశాలు లభించేందుకు మళ్లీ టెట్ నిర్వహించాలని మంత్రి కొల్లు రవీంద్రను అభ్యర్థులు శ్రీకాంత్ తదితరులు కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రగాయాలు

చల్లపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి - మచిలీపట్నం జాతీయ రహదారిపై పాతమాజేరు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. పాగోలు గ్రామానికి చెందిన భోగాది శివరామకృష్ణ ప్రస్తుతం భోగిరెడ్డిపల్లిలో నివాసం ఉంటున్నాడు. తాపీ పనిచేసుకుంటూ జీవనం సాగించే శివరామకృష్ణ పని ముగించుకుని ఇంటికి తిరిగివస్తుండగా, రాత్రి 8 గంటలకు పాతమాజేరు సబ్‌స్టేషన్ వద్దకు రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో శివరామకృష్ణకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించటంతో పైలట్ శివకుమార్, ఈఎంటీ శ్రీనివాసరావు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని ప్రథమ చికిత్స అందించి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రోన్ కెమెరా నిఘాతో పేకాటరాయుళ్ల అరెస్టు

కృత్తివెన్ను, ఏప్రిల్ 1 : పెదగొల్లపాలెం గ్రామంలో డ్రోన్ కెమెరా నిఘాతో పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్సై పైడిబాబు తెలిపారు. పేకాట శిబిరంపై మెరుపు దాడి చేసి, ఐదుగుర్ని అదుపులోకి తీసుకుని రూ.2030 స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసామన్నారు.